ANN తెలుగు

Follow: @ANNTELUGU

25-04-2026

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 118 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316


కొత్త రాజకీయ శక్తిగా వస్తున్నాం

25 ఏప్రిల్ 2026, ఉదయం 9 గంటలకు

అద్వయ కన్వెన్షన్, మునీరాబాద్, మేడ్చల్



ANN తెలుగు

మహా పత్రిక

శనివారం, హైదరాబాద్
25-04-2026

మహా స్పెషల్










# తెలుగునాట ప్రాంతీయ పార్టీల హవా

## ఎన్టీఆర్ ప్రభంజనం నుంచి నేటి సరికొత్త సమీకరణాల దాకా..

దశాబ్దాలుగా ఢిల్లీ పీఠాన్ని శాసిస్తున్న ప్రాంతీయ శక్తులు

సంచలనాలకు వేదిక తెలుగు గడ్డ.. తెలంగాణ నేలపై నేడు మరో కొత్తపార్టీ ఆవిర్భావం..

మహిళా నేత సారథ్యంలో కొత్త శక్తిగా ముందుకు

(మహా ప్రత్యేకం)

భారత రాజకీయ ముఖచిత్రంపై తెలుగు రాష్ట్రాలకు ఎప్పుడూ ఒక విశిష్టమైన, తిరుగులేని స్థానం ఉంటుంది. దశాబ్దాలుగా ఢిల్లీ పెద్దల కనుసన్నల్లో, జాతీయ పార్టీల గుత్తాధిపత్యంలో నలిగిపోయిన రాష్ట్ర రాజకీయాల్లో 'ఆత్మగౌరవం', 'ప్రాంతీయ అస్తిత్వం' అనే బలమైన పునాదులతో పురుడుపోసుకున్న ప్రాంతీయ పార్టీలు సృష్టించిన రాజకీయ సునామీ అంతాఇంతా కాదు. ఒకప్పుడు ఢిల్లీ నుంచి ఏ ఆదేశం వస్తే దానికి తలవూపిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు.. నందమూరి తారక రామారావు రాకతో పూర్తిగా ప్రాంతీయ పార్టీల ఆధిపత్యంలోకి వచ్చాయి. ఆనాడు 1982లో అన్న ఎన్టీఆర్ వేసిన ఆత్మగౌరవ బాట.. నేడు (2026) మారుతున్న రాజకీయ సమీకరణాల నడుమ కొత్త పార్టీల ఆవిర్భావం దాకా ఎన్నో చారిత్రక మలుపులు తిరిగింది. గడచిన నాలుగు దశాబ్దాలలో తెలుగు నేలపై సుమారు 20కి పైగా ప్రధాన ప్రాంతీయ పార్టీలు ఉద్భవించాయి. అఖండ విజయాలు సాధించి చరిత్ర సృష్టించిన పార్టీలు కొన్ని అయితే, ప్రజల భావోద్వేగాల మధ్య పుట్టి అనతికాలంలోనే కనుమరుగైన పార్టీలు ఎన్నో. ఉమ్మడి రాష్ట్రం నుంచి విడిపోయిన రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయ ముఖచిత్రాన్ని శాశ్వతంగా మార్చేసిన ప్రాంతీయ శక్తుల ప్రస్థానం, విజయాలు, వైఫల్యాలపై ఈ ప్రత్యేక కథనం.

### తెలుగుదేశం అప్రతిహత మహాప్రస్థానం

భారత రాజకీయ యవనికపై, ప్రత్యేకించి దక్షిణ భారతదేశ చరిత్రలో 1982వ సంవత్సరం ఒక సువర్ణాధ్యాయం. ఢిల్లీ పీఠాన్ని శాసించే అధిష్టానం కనుసన్నల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలు నలిగిపోతున్న దయనీయమైన కాలమది. ముఖ్యమంత్రులను ఒక కీలుబొమ్మల్లా మార్చడం, రాష్ట్ర నాయకత్వాన్ని విమానాశ్రయాల్లో సైతం బహిరంగంగా అవమానించడం లాంటి సంఘటనలు తెలుగు ప్రజల మనోభావాలను, వారి స్వాభిమానాన్ని తీవ్రంగా గాయపరిచాయి. సరిగ్గా ఆ చారిత్రక శూన్యతను, ప్రజల గుండెల్లో రగులుతున్న ఆవేదనను గ్రహించిన నటసార్వభౌమ నందమూరి తారక రామారావు ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. దశాబ్దాలుగా వెండితెరపై దేవుడిగా, పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలతో కోట్లాది మంది ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్న ఆయన, సినిమా గ్లామర్ ను పక్కనబెట్టి "తెలుగువాడి ఆత్మగౌరవం" అనే ఒకే ఒక్క బలమైన భావోద్వేగపూరితమైన నినాదంతో రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1982 మార్చి 29న హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయన 'తెలుగుదేశం పార్టీ' ఆవిర్భావ ప్రకటన చేసిన క్షణం, బహుశా భారతీయ రాజకీయాల్లో అత్యంత ప్రకంపనలు సృష్టించిన క్షణంగా చరిత్రకారులు నేటికీ విశ్లేషిస్తుంటారు. ఎన్టీఆర్ తన ప్రచారానికి ఎంచుకున్న మార్గం కూడా అప్పట్లో ఒక సంచలనమే. మును పెన్నడూ లేని విధంగా ఒక పాత షెవర్లే వ్యాన్‌ను 'చైతన్య రథం'గా మార్చుకుని, ఆయన రాష్ట్రవ్యాప్తంగా పల్లెపల్లెనా పర్యటించారు. ముఖానికి రంగు లేకుండా, కాషాయ వస్త్రాలు ధరించి, నేరుగా ప్రజల కష్టసుఖాలను తెలుసుకునేందుకు ఆయన చేసిన సుదీర్ఘ యాత్ర తెలుగు ప్రజలను ఉర్రూతలూగించింది. పార్టీ పెట్టిన కేవలం తొమ్మిది నెలల్లోనే, అప్పటివరకు అజేయంగా పాతుకుపోయిన అధికార కాంగ్రెస్ పార్టీ కంచుకోటను బద్దలుకొట్టి, మునుపెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో అఖండ మెజారిటీతో తెలుగుదేశం పార్టీ అధికార పీఠాన్ని అధిరోహించడం ప్రపంచ రాజకీయ చరిత్రలోనే ఒక అరుదైన రికార్డు. ఎన్టీఆర్ అధికారంలోకి రావడం కేవలం నాయకత్వ మార్పిడి కాదు, అదొక సామాజిక విప్లవం. పేదవాడికి కడుపు నిండా అన్నం పెట్టాలనే దృఢ సంకల్పంతో ఆయన ప్రవేశపెట్టిన 'రెండు రూపాయలకే కిలో బియ్యం' పథకం దేశానికే ఆదర్శంగా నిలిచింది. పక్కా గృహాల నిర్మాణం, జనతా వస్త్రాలు, వితంతు పింఛన్లు వంటి సంక్షేమ పథకాలు పేద వర్గాలకు కొండంత అండగా నిలిచాయి. సామాజిక న్యాయం దిశగా ఆయన వేసిన అడుగులు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవి. తరతరాలుగా గ్రామీణ వ్యవస్థను పట్టిపీడిస్తున్న పటేల్, పట్వారీ వ్యవస్థను ఏకకాలంలో రద్దు చేయడం, తండ్రి ఆస్తిలో ఆడపడుచులకు సమాన హక్కు కల్పిస్తూ చట్టం చేయడం, మండల వ్యవస్థను ప్రవేశపెట్టి పరిపాలనను సామాన్యుడి ముంగిటకు చేర్చడం లాంటి నిర్ణయాలు తెలుగుదేశం పార్టీని ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలబెట్టాయి. అయితే, ఈ మహాప్రస్థానంలో తెలుగుదేశం పార్టీకి అడుగడుగునా సవాళ్లు, కుట్రలు ఎదురవుతూనే వచ్చాయి. 1984లో ముఖ్యమంత్రి ఎన్టీఆర్ గుండె శస్త్రచికిత్స నిమిత్తం అమెరికా వెళ్లిన సమయంలో, నాదెండ్ల భాస్కరరావు రూపంలో ఎదురైన వెన్నుపోటు భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక చీకటి రోజు. గవర్నర్ రామ్‌లాల్ ఏకపక్ష నిర్ణయంతో ఎన్టీఆర్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించిన తీరు యావత్ దేశాన్ని నివ్వెరపరిచింది. కానీ, ప్రజల అండ, అచంచలమైన విశ్వాసం ఉన్న నాయకుడిని ఏ శక్తులూ ఆపలేవని ఆనాటి "ప్రజాస్వామ్య పునరుద్ధరణ" పోరాటం నిరూపించింది. మండుటెండల్లో ఎన్టీఆర్ తన ఎమ్మెల్యేలతో కలిసి ఢిల్లీ వీధుల్లో చేసిన కవాతు, రాష్ట్రవ్యాప్తంగా ఉవ్వెత్తున ఎగసిన ప్రజా ఉద్యమం ముందు కేంద్రం దిగిరాక తప్పలేదు. సరిగ్గా నెల రోజుల వ్యవధిలోనే ఎన్టీఆర్ తిరిగి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ప్రజాస్వామ్య సత్తాను చాటారు. ఆ తర్వాత జాతీయ స్థాయిలో కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయంగా 'నేషనల్ ఫ్రంట్'ను ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వాలనే శాసించే నిర్ణయాత్మక శక్తిగా తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ నిలబెట్టారు.

### పరాజయాల పునాదులపై జనసేన విజయ సౌధం

సమకాలీన భారతీయ రాజకీయాల్లో, ఒక నాయకుడు అపారమైన ప్రజాకర్షణ ఉండి కూడా, తొలి అడుగుల్లోనే అత్యంత ఘోరమైన పరాజయాన్ని చవిచూసి, ఆపై కక్ష సాధింపులకు గురై, వ్యవస్థల ద్వారా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని.. అయినా సరే వెనకడుగు వేయకుండా దశాబ్ద కాలం పాటు నెత్తురోడుతూ పోరాడి, అంతిమంగా అఖండ విజయాన్ని సాధించిన చరిత్ర బహుశా ఒక్క జనసేన పార్టీకి, దాని వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్‌కే దక్కుతుంది. సినిమా గ్లామర్ ఉంటే రాజకీయాల్లో రాత్రికి రాత్రే అద్భుతాలు సృష్టించవచ్చనే భ్రమలను పటాపంచలు చేస్తూ, రాజకీయాలంటే కేవలం అధికారం కాదు, అదొక నిరంతర సామాజిక బాధ్యత అని నిరూపించిన జనసేన ప్రస్థానం ప్రాంతీయ పార్టీల చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం. "ప్రశ్నించడానికే పార్టీ" అనే ఒకే ఒక్క బలమైన నినాదంతో, చే గువేరా స్ఫూర్తితో, అవినీతి రహిత నవ సమాజ నిర్మాణమే ధ్యేయంగా 2014 మార్చి 14న హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని అట్టహాసంగా ప్రారంభించారు. ఆ ఆవిర్భావ సభలో ఆయన చేసిన ఉద్వేగభరితమైన ప్రసంగం, కుల మతాలకు అతీతంగా మానవత్వాన్ని చాటిన తీరు యావత్ తెలుగు రాష్ట్రాల యువతను ఒక ఉప్పెనలా కదిలించింది. పార్టీ స్థాపించిన తొలినాళ్లలో పవన్ కళ్యాణ్ తీసుకున్న నిర్ణయాలు ఆయనలోని రాజకీయ పరిణితికి అద్దం పట్టాయి. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రం విభజనకు గురైన విపత్కర పరిస్థితుల్లో, కొత్తగా ఏర్పడుతున్న నవ్యాంధ్రప్రదేశ్‌కు ఒక అనుభవజ్ఞుడైన నాయకుడు అవసరమని ఆయన బలంగా నమ్మారు. తన స్వంత రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదనే ఉద్దేశ్యంతో జనసేన పార్టీని ఎన్నికల బరిలో నిలపలేదు. దానికి బదులుగా, తెలుగుదేశంబీజేపీ కూటమికి బేషరతుగా మద్దతు ప్రకటించి, ఆ కూటమి అధికారంలోకి రావడంలో అత్యంత కీలకమైన 'కింగ్ మేకర్' పాత్ర పోషించారు. అయితే, అధికారాన్ని పంచుకునే అవకాశాన్ని సున్నితంగా తిరస్కరించి, కేవలం ఒక కాపలాదారుడిగా ఉంటానని ప్రకటించారు. ఆ తర్వాత ఐదేళ్ల పాటు శ్రీకాకుళం ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యలపై, రాజధాని రైతుల కష్టాలపై, ప్రత్యేక హోదా సాధన కోసం, చేనేత కార్మికుల అభ్యున్నతి కోసం ఆయన రోడెక్కి చేసిన పోరాటాలు జనసేన పార్టీని సామాన్య ప్రజల పక్షపాతిగా నిలబెట్టాయి. సమస్య వచ్చిన ప్రతిచోటా తన గళాన్ని వినిపిస్తూ, అధికార పార్టీ తప్పులను నిర్భయంగా ఎత్తిచూపుతూ ఒక నిర్మాణాత్మకమైన విపక్షంగా జనసేన తన ప్రస్థానాన్ని కొనసాగించింది. కానీ, 2019 సార్వత్రిక ఎన్నికలు జనసేన పార్టీ చరిత్రలో అత్యంత విషాదకరమైన, కఠినమైన పరీక్షను ఎదురుచూసేలా చేశాయి. ఓటమిని అంగీకరించి రాజకీయాల నుంచి తప్పుకుంటాడని అందరూ భావించిన తరుణంలో, పవన్ కళ్యాణ్ ఒక ఫీనిక్స్ పక్షిలా పైకి లేచారు. తనను తాను పునఃసమీక్షించుకుని, పార్టీని క్షేత్రస్థాయి నుంచి పునర్నిర్మించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2019 నుంచి 2024 మధ్య కాలం జనసేన పార్టీకి అగ్నిపరీక్ష. అధికార వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఆయన పర్యటనలను అడుగడుగునా అడ్డుకోవడం, విశాఖపట్నం లాంటి నగరాల్లో ఆయనను హోటల్ గదికే పరిమితం చేయడం, వ్యక్తిగత దూషణలకు దిగడం లాంటి పరిణామాలు పవన్ కళ్యాణ్‌లో పోరాట పటిమను మరింత రగిలించాయి. ప్రజల సమస్యలపై 'జనవాణి' కార్యక్రమాలు, కౌలు రైతుల కష్టాలు కన్నీళ్లు తుడుస్తూ తన స్వంత డబ్బును విరాళంగా ఇవ్వడం లాంటి మానవతా దృక్పథం ఆయనకు ప్రజల్లో విశేషమైన గౌరవాన్ని తెచ్చిపెట్టాయి. ముఖానికి రంగు వేసుకుని సంపాదించిన ప్రతి రూపాయినీ పార్టీ కోసం, రైతుల కోసం ఖర్చు చేసిన ఆయన నిస్వార్థ రాజకీయాలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. 'వారాహి' యాత్ర పేరుతో ఆయన చేపట్టిన పర్యటనలు ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రాన్నే మార్చివేశాయి. 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి పవన్ కళ్యాణ్ పూర్తిగా ఒక పరిణితి చెందిన రాజకీయ వ్యూహకర్తగా మారారు. పొత్తులో భాగంగా కేవలం 21 అసెంబ్లీ స్థానాలు, 2 పార్లమెంటు స్థానాలకు మాత్రమే పరిమితమవ్వడం క్యాడర్‌లో కొంత అసంతృప్తిని రగిలించినా, పెద్ద లక్ష్యం కోసం చిన్న చిన్న త్యాగాలు తప్పవని ఆయన శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ వ్యూహం అద్భుతంగా ఫలించింది. 2024 ఎన్నికల ఫలితాలు జనసేన పార్టీని ఒక అజేయమైన శక్తిగా నిలబెట్టాయి. పోటీ చేసిన 21 కి 21 అసెంబ్లీ స్థానాలు, 2 కి 2 ఎంపీ స్థానాలను గెలుచుకుని భారతీయ ఎన్నికల చరిత్రలో 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించిన ఒకే ఒక్క ప్రాంతీయ పార్టీగా జనసేన నవ చరిత్రను లిఖించింది. పిఠాపురం నుంచి భారీ మెజారిటీతో గెలుపొందిన పవన్ కళ్యాణ్, ఏపీ ఉప ముఖ్యమంత్రిగా, కీలక శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టి సక్సెస్ ఫుల్ పార్టీ అధినేతగా తన ప్రస్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు.

### లోక్ సత్తా ఆదర్శ ప్రయాణం

నైతిక విలువలు, జవాబుదారీతనం ప్రాతిపదికన ఎన్నికల్లో గెలవాలని కలలు కన్న ఒక స్వచ్ఛమైన రాజకీయ ప్రయోగమే 'లోక్ సత్తా' పార్టీ. సివిల్ సర్వీసెస్‌లో అద్భుతమైన ట్రాక్ రికార్డ్ ఉన్న ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్, తన అత్యున్నత పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేసి, వ్యవస్థను ప్రక్షాళన చేయాలనే ఆశయంతో మొదట ఒక పౌర వేదికగా లోక్ సత్తాను స్థాపించారు. 2006 అక్టోబర్ 2వ తేదీన, మహాత్మా గాంధీ జయంతి రోజున హైదరాబాద్ వేదికగా లోక్ సత్తాను అధికారికంగా రాజకీయ పార్టీగా ప్రకటించారు. "మార్పు కోసం ఓటు వేయండి.. నోటుకు ఓటు అమ్ముకోవద్దు" అన్న ఆయన పిలుపు విద్యావంతులను, మేధావులను, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను, యువతను విశేషంగా ఆకర్షించింది. 2009 ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి జయప్రకాశ్ నారాయణ్ ఒక్కరు మాత్రమే ఎమ్మెల్యేగా విజయం సాధించారు. మిగిలిన రాష్ట్రమంతటా పార్టీకి గౌరవప్రదమైన ఓట్లు (సుమారు 1.8 శాతం) వచ్చినప్పటికీ, సీట్లుగా మలచుకోలేకపోయారు. అసెంబ్లీలో జయప్రకాశ్ నారాయణ్ ఒక్కరే ఉన్నప్పటికీ, వంద మంది సభ్యులు చేసే స్థాయి వాదనను ఆయన వినిపించేవారు. 2014 ఎన్నికల నాటికి రాష్ట్ర విభజన భావోద్వేగాల మధ్య లోక్ సత్తా పూర్తిగా కనుమరుగైంది.

### కవిత పార్టీ సంచలనం

తెలంగాణలో ఇపుడు కవిత పార్టీ సంచలనంగా మారుతోంది. కేసీఆర్ టీఆర్ఎస్ లో అనేకపార్టీలను కలిపేసుకోగా. తొలిసారి ఆయన కుటుంబం నుండే మరోపార్టీ పుట్టడం పెద్ద షాకింగ్ అంశమే. కవితకు క్షేత్రస్థాయి నెట్ వర్క్ ఉండడంతో పార్టీ బలంగా ఉంటుందన్న అంచనాలున్నాయి. శనివారం కవిత పార్టీ ఆవిర్భావం జరగనుంది.

## టీఆర్ఎస్.. ఓ సంచలనం

తెలంగాణ రాజకీయ యవనికపై 'గులాబీ జెండా' ఒక అజేయమైన అస్తిత్వ కేతనం. ఆరు దశాబ్దాల పరాయి పాలన సంకెళ్లను తెంచి, వివక్షాగ్నిలో రగిలిన కోట్లాది తెలంగాణ హృదయాలకు స్వరాష్ట్ర స్వాంతన చేకూర్చిన ధీశాలి కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ (నేటి బీఆర్ఎస్) ప్రస్థానం భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక అద్భుత ఘట్టం. "తెలంగాణ వస్తే వస్తది.. లేకపోతే నా ప్రాణం పోతది" అనే భీష్మ ప్రతిజ్ఞతో, జలదృశ్యం వేదికగా మొదలైన ఈ ఉద్యమ ప్రయాణం, రాజకీయాలను రణతంత్రంగా మలుచుకుని, ఢిల్లీ పీఠాన్ని శాసించి, అసాధ్యమన్న రాష్ట్రాన్ని సుసాధ్యం చేసింది. నీళ్లు, నిధులు, నియామకాలే ప్రాతిపదికగా.. "కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో" అన్న నినాదంతో మృత్యువు అంచు దాకా వెళ్లి మలిదశ ఉద్యమాన్ని మలుపు తిప్పిన ఆ అలుపెరగని పోరాటం ఒక చారిత్రక అనివార్యత. పదేళ్ల పరిపాలనలో మిషన్ భగీరథ ద్వారా గొంతు తడిపి, కాళేశ్వరం ప్రాజెక్టుతో బీడు భూములకు జీవం పోసి, రైతుబంధుతో కర్షక లోకానికి వెన్నుముకగా నిలిచిన ఈ పార్టీ, కేవలం అధికారం కోసమే కాక, ఒక జాతి పునర్నిర్మాణం కోసం పరితపించింది. పతనాలు సహజమైనా, ఎదురుదెబ్బలు తగిలినా.. తెలంగాణ మట్టిలో వేళ్లూనుకున్న ఈ ఉద్యమ పార్టీ, గెలుపులో గర్వపడక, ఓటమిలో కుంగిపోక, నిరంతరం ప్రజాక్షేత్రంలో గొంతుకగా నిలబడటమే దాని అసలైన విజయం. ఒకనాడు అపహాస్యం చేసిన శక్తులే నేడు తెలంగాణ వైభవాన్ని చూసి ఆశ్చర్యపోయేలా చేసిన బీఆర్ఎస్ ప్రస్థానం.. అక్షరాలా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ శిఖరం.

### విశ్లేషణాత్మక ముఖ్యాంశాలు..

**ఉద్యమ పునాది:** 2001, ఏప్రిల్ 27న ప్రారంభమైన టీఆర్ఎస్, రాజకీయాలను కేవలం అధికారం కోసం కాకుండా, ఉద్యమాన్ని సజీవంగా ఉంచే 'రాజకీయ అస్త్రం'గా వాడుకుంది.

**చారిత్రక దీక్ష:** 2009 నవంబర్ 29 నాటి ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ చరిత్రను రెండుగా విభజించింది దీక్షకు ముందు, దీక్ష తర్వాత.

**నవ నిర్మాణ కర్త:** రాష్ట్రం ఏర్పడిన తర్వాత మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతుబంధు వంటి వినూత్న పథకాలతో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచింది.

**సవాళ్లు & గుణపాఠాలు:** 2023 ఎన్నికల ఫలితాలు ప్రజాస్వామ్యంలోని మార్పును సూచించినా, తెలంగాణ ప్రయోజనాల రక్షణలో బీఆర్ఎస్ పాత్ర ఎప్పటికీ కీలకం.

## ప్రజారాజ్యం (పీఆర్పీ) సంచలనం

తెలుగు రాష్ట్రాల ప్రాంతీయ రాజకీయ చరిత్రలో ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం ఒక అద్భుతమైన కల. కోట్లాది మంది ఆశలు, ఒక సామాజిక వర్గపు చిరకాల స్వప్నం, అవినీతికి వ్యతిరేకంగా రగిలిన ఆగ్రహం.. ఇవన్నీ కలగలిపి ఏర్పడిన ఒక బృహత్తర రాజకీయ ప్రయోగం ప్రజారాజ్యం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దశాబ్దాల పాటు కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల మధ్య మాత్రమే అధికారం చేతులు మారుతున్న తరుణంలో, సామాజిక న్యాయం కోసం నిరుపేద, బడుగు, బలహీన వర్గాలు ఒక బలమైన ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్న కాలమది. ఆ సమయంలో, తెలుగు చలనచిత్ర పరిశ్రమను నాలుగు దశాబ్దాల పాటు ఏకఛత్రాధిపత్యంగా శాసించిన, కోట్లాది మంది గుండెల్లో 'మెగాస్టార్'గా సుస్థిర స్థానం సంపాదించుకున్న చిరంజీవి రాజకీయ ప్రవేశం చేయబోతున్నారన్న వార్త ఉమ్మడి రాష్ట్రాన్ని కుదిపేసింది. ఆయన కేవలం ఒక సినీ నటుడు మాత్రమే కాదు, చిరంజీవి బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ ద్వారా ఆయన చేసిన విశేషమైన సామాజిక సేవ, ఆయనలోని మానవతావాదం ప్రజలకు అత్యంత చేరువ చేశాయి. 2008 ఆగస్టు 26వ తేదీ, తిరుపతిలోని అవిలాల మైదానం బహుశా చరిత్రలో కనీవినీ ఎరుగని ఒక రాజకీయ సముద్రానికి సాక్ష్యంగా నిలిచింది. పది లక్షల మందికి పైగా అభిమానులు, ప్రజల జనసందోహం నడుమ చిరంజీవి 'ప్రజారాజ్యం పార్టీ'ని అట్టహాసంగా ప్రకటించారు. ఆ వేదికపై మదర్ థెరిసా, జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ లాంటి మహనీయుల చిత్రపటాలను ఉంచి, తన పార్టీ సిద్ధాంతం 'సామాజిక న్యాయం' అని ఆయన స్పష్టంగా ప్రకటించారు. "మార్పు తథ్యం, మనమే ఆ మార్పు" (మార్పు కోసం ప్రజారాజ్యం) అన్న ఆయన నినాదం పల్లెపల్లెనా ప్రతిధ్వనించింది. పార్టీ జెండా ఆవిష్కరణ దళిత, మైనారిటీ, బీసీ వర్గాల చేతుల మీదుగా జరిపించి, బడుగు వర్గాలకు రాజ్యాధికారమే తన అంతిమ లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. ఆ రోజు ఆయన చేసిన ప్రసంగం, ఆయన బాడీ లాంగ్వేజ్ చూసి, ఉమ్మడి రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి చిరంజీవే అని జాతీయ మీడియా సైతం కోడై కూసింది. పార్టీకి ఎన్నికల సంఘం కేటాయించిన 'రైలు ఇంజిన్' గుర్తును ప్రగతికి ప్రతీకగా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లారు. కానీ, సినిమా తెర మీద అద్భుతాలు సృష్టించడం వేరు, కలుషితమైన రాజకీయ రణరంగంలో నిలబడటం వేరు అన్న చేదు వాస్తవం ప్రజారాజ్యం పార్టీకి అనతికాలంలోనే అనుభవంలోకి వచ్చింది. పార్టీని ఒక వ్యవస్థాగత యంత్రాంగంగా నిర్మించడంలో నాయకత్వం పూర్తిగా విఫలమైంది. పదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉండి నైరాశ్యంలో ఉన్న కాంగ్రెస్, టీడీపీల్లోని కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు, ఆర్థిక బలం ఉన్న పారిశ్రామికవేత్తలు ప్రజారాజ్యం పార్టీని ఆవహించారు. అధికార పీఠాన్ని ఆశించిన పార్టీ కేవలం 18 సీట్లకు పరిమితమైనా బలమైన ఓటుబ్యాంకు సాధించింది. అయితే ఎన్నికల పరాజయం తర్వాత ప్రజారాజ్యం పార్టీని నడపడం చిరంజీవికి ఒక గుదిబండలా మారింది. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడుతున్న సమయంలో పీఆర్పీ తీసుకున్న సమైక్యాంధ్ర స్టాండ్, తెలంగాణ ప్రాంతంలో ఆ పార్టీ ఉనికిని పూర్తిగా తుడిచిపెట్టేసింది. పార్టీని ఆర్థికంగా, సంస్థాగతంగా నడిపించే భారాన్ని మోయలేక, అధిష్టానం నిర్ణయాల ముందు తలొగ్గి, చివరకు 2011 ఆగస్టులో తన ఆశయాల వేదిక ప్రజారాజ్యం పార్టీని అధికారికంగా భారత జాతీయ కాంగ్రెస్‌లో విలీనం చేస్తున్నట్లు చిరంజీవి ప్రకటించారు. అయినా ప్రజారాజ్యం అనేకమంది నాయకులను తయారుచేసింది.

## ప్రజాభిమానమే పునాదిగా.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చారిత్రక సంచలనం

భారతీయ ప్రజాస్వామ్య చరిత్రలో నాయకుల అకాల మరణాలు ఎన్నో రాజకీయ ప్రకంపనలకు కారణమయ్యాయి. కానీ ఒక మహానేత మరణంతో ఉద్భవించిన భావోద్వేగం ఏకంగా ఒక బలీయమైన రాజకీయ పార్టీ ఆవిర్భావానికి, ఆ తదనంతరం అది ఒక రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్నే మార్చివేసే స్థాయికి ఎదగడం బహుశా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్సీపీ) విషయంలోనే జరిగి ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తనదైన శైలిలో శాసించి, అటు పార్టీలోనూ, ఇటు ప్రజల్లోనూ ఎవరూ చెరపలేని ముద్ర వేసుకున్న ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి 2009 సెప్టెంబర్ 2న పావురాల గుట్ట వద్ద జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోవడం యావత్ రాష్ట్రాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మరణవార్తను తట్టుకోలేక వందలాది మంది సామాన్య ప్రజలు గుండెలు పగిలి మరణించారు. ఆ ఆవేదనలో ఉన్న కుటుంబాలను నేరుగా కలిసి పరామర్శించేందుకు వై.ఎస్. కుమారుడు, అప్పటి కడప ఎంపీ వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి 'ఓదార్పు యాత్ర'ను ప్రకటించారు. సరిగ్గా ఇక్కడే కాంగ్రెస్ అధిష్టానానికి, జగన్మోహన్ రెడ్డికి మధ్య తీవ్రమైన సైద్ధాంతిక, రాజకీయ ఘర్షణ మొదలైంది. యాత్రను విరమించుకోవాలని ఢిల్లీ పెద్దలు ఇచ్చిన ఆదేశాలను జగన్మోహన్ రెడ్డి సున్నితంగా, అదే సమయంలో అత్యంత కఠినంగా తిరస్కరించారు. తన తండ్రి కోసం ప్రాణాలిచ్చిన వారిని పరామర్శించడం రాజకీయాల కంటే ముఖ్యమని, ఇది తన నైతిక బాధ్యతని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆయనను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్న తరుణంలో, ప్రజల కోసమే తన పయనం అంటూ కాంగ్రెస్ పార్టీకి, ఎంపీ పదవికి రాజీనామా చేసి బయటకు వచ్చారు. తన తండ్రి ఆశయాల సాధనే లక్ష్యంగా 2011 మార్చి 12న 'యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ' (వైఎస్సార్సీపీ)ని అధికారికంగా స్థాపించారు. ఆ పార్టీ ఆవిర్భావమే ఒక మహా సంచలనం. ఆ తర్వాత కడప పార్లమెంటుకు, పులివెందుల అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్సీపీ తరఫున పోటీ చేసిన జగన్మోహన్ రెడ్డి, ఆయన తల్లి విజయమ్మ రికార్డు స్థాయి మెజారిటీలతో గెలుపొంది దేశ దృష్టిని ఆకర్షించారు. అయితే, ఎదుగుతున్న ఒక కొత్త రాజకీయ నాయకుడిని అడ్డుకునేందుకు అప్పటి వ్యవస్థలు చేసిన ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. అక్రమాస్తుల ఆరోపణల పేరిట జగన్మోహన్ రెడ్డిపై సీబీఐ కేసులు నమోదు కావడం, ఆయన అరెస్టై ఏకంగా 16 నెలల పాటు జైలు జీవితం గడపాల్సి రావడం ఆయన రాజకీయ జీవితంలో అత్యంత కఠినమైన పరీక్ష. ఆయన జైలులో ఉన్న సమయంలో పార్టీ క్యాడర్ చెల్లాచెదురు కాకుండా, ఆయన తల్లి విజయమ్మ, సోదరి వై.ఎస్. షర్మిల పార్టీ బాధ్యతలను తమ భుజస్కంధాలపై వేసుకున్నారు.

Follow: @ANNTELUGU
25-04-2026
ANN తెలుగు
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 118 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఏపీ లిక్కర్ స్కామ్‌లో ఈడీ దాడులు

**హైదరాబాద్, తిరుపతిలో 12 చోట్ల సోదాలు**

కీలక పత్రాలు స్వాధీనం

ఇది వరకే రూ. 442 కోట్ల ఆస్తులను జప్తు చేసిన ఈడీ

**విజయవాడ, మహా :** ఏపీ మద్యం కేసులో నిందితుల నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో పాటు రాజ్ కేసిరెడ్డి, బాలాజీ గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణ మోహన్, ఇళ్లల్లో ఉదయం నుంచే సోదాలు మొదలయ్యాయి. లిక్కర్ స్కామ్ కేసులో సిట్ నివేదిక ఆధారంగా తిరుపతి, విజయవాడతో పాటు హైదరాబాద్‌లోనూ అధికారులు తనిఖీలు చేపట్టారు.

**ఆస్తి పత్రాలు, డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్న ఈడీ..**

మాజీ సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితులు, నిందితులైన మాజీ ప్రజాప్రతినిధులు, అధికారుల నివాసాలే లక్ష్యంగా హైదరాబాద్, తిరుపతిలోని 12 ప్రాంతాల్లో ఈడీ హైదరాబాద్ యూనిట్ భారీ సోదాలు నిర్వహించింది.

మిగతా 5లో

**టాప్ న్యూస్**



### గొడ్డలి పార్టీతో జాగ్రత్త...

- టీడీపీ కార్యకర్తలతో చంద్రబాబు
- జగన్ పై తీవ్ర వ్యాఖ్యలు

04



### ఏపీలో థర్డ్ పార్టీ

- జూలై తర్వాత పార్టీ పెడతా..
- విజయసాయిరెడ్డి ప్రకటన

05



### బీజేపీలో చేరట్లే...

- మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి
- మోదీని కలవడం పాలిటిక్స్ కాదు

04

# కవిత పార్టీ ప్రకటన నేడే

## తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సంచలనం

- ధైర్యంగా దూసుకుపోయే డైనమిక్ లీడర్ గా కవితకు గుర్తింపు
- టీఆర్ఎస్ 2.0గా ఉద్యమ లక్ష్యాల సాధన టార్గెట్
- బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలే అస్త్రాలు
- తండ్రి లాగే.. సరైన ముహూర్తం చూసుకుని రంగంలోకి
- పార్టీ పేరు.. జెండా అజెండా ప్రకటించనున్న అధినేత్రి
- మేడ్చల్ జిల్లా మునీరాబాద్ వేదికగా ప్రగతిశీల రాజకీయం
- బీఆర్ఎస్ పార్టీపై యుద్ధం ప్రకటించనున్న కవిత..
- ఉద్యమ లక్ష్యాల సాధనే ఎజెండాగా పార్టీ



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక మలుపునకు సమయం ఆసన్నమైంది. కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయని ప్రకటించి.. తనను కుట్రపూరితంగా కేసులో ఇరికించి అరెస్ట్ చేయించారని భగ్గుమన్న కవిత పార్టీ అధికారం దూరం కావడానికి కారణాలు బహిరంగంగా ముందు పెట్టడంతో ఆ పార్టీ పెద్దలకు కోపమొచ్చింది. పార్టీ నుండి సస్పెన్షన్‌కు గురైనతెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరింత పట్టుదలతో తన రాజకీయ ప్రస్థానంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించబోతున్నారు. కేవలం ఒక ప్రాంతానికో, వర్గానికో పరిమితం కాకుండా.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రగతిశీల, వామపక్ష శక్తులను ఒకే తాటిపైకి తెచ్చేందుకు ఆమె కసరత్తు పూర్తి చేశారు. శనివారం ఉదయం మేడ్చల్ జిల్లా మునీరాబాద్ వేదికగా నూతన రాజకీయ పార్టీని ప్రకటించబోతున్నారు. తండ్రి కేసీఆర్, సోదరుడు కేటీఆర్ అనుసరిస్తున్న రాజకీయ పంథాకు భిన్నంగా, 'తెలంగాణ అస్తిత్వం' నినాదంతో ఆమె ప్రజాక్షేత్రంలోకి రాబోతున్నారు తెలంగాణ పాలిటిక్స్ లో కవిత డేరింగ్ అండ్ డాషింగ్ లీడర్ గా గుర్తింపు పొందారు. పదునైన విమర్శలు చేయడం, సమస్యలపై అధ్యయనం చేసి ఆధారాలతో ప్రత్యర్థులపై అస్త్రాలు సంధించడం కవితకు వెన్నతో పెట్టిన విద్య.

**మునీరాబాద్‌లో భారీ ఏర్పాట్లు..**
**అద్వయ కన్వెన్షన్‌లో ఆవిష్కరణ సభ**

మేడ్చల్ జిల్లాలోని జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న మునీరాబాద్ గ్రామం ఈ చారిత్రక ఘట్టానికి సాక్ష్యం కాబోతోంది. ఇక్కడి అద్వయ కన్వెన్షన్ హాల్‌లో 25వ తేదీ శనివారం ఉదయం 8 గంటలకు పార్టీ ఆవిష్కరణ సభ ప్రారంభం కానుంది. సుమారు 20 వేల మంది కూర్చునే సామర్థ్యం ఉన్న ఈ హాల్ చుట్టూ ఉన్న 18 ఎకరాల్లో విస్తృతమైన సదుపాయాలు కల్పించారు.

**కాకతీయ తోరణం నుంచి మహనీయుల వరకు...**

సభా ప్రాంగణాన్ని తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా తీర్చిదిద్దుతున్నారు. వరంగల్ కాకతీయ తోరణం ఆకృతిలో నిర్మిస్తున్న ప్రధాన ప్రవేశ ద్వారం సభకు వచ్చే వారికి స్వాగతం పలకనుంది. కేవలం రాజకీయాలే కాకుండా సామాజిక న్యాయాన్ని తన పార్టీ సిద్ధాంతంగా మలుచుకున్న కవిత, వేదికపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ విగ్రహాలతో పాటు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తున్నారు. ఉదయం 10 గంటలకు పార్టీ పేరు, జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరగనుంది. అంతకుముందు ఆమె అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించి, ఉద్యమ స్ఫూర్తితో పార్టీ జెండాను ఎగురవేయనున్నారు.

మిగతా 4లో

## ఆర్టీసీ సమ్మె సుఖాంతం

**ప్రభుత్వంతో జేఏసీ చర్చలు సఫలం**

కేసీఆర్ కంటే మీరే మేలన్న జేఏసీ.. రేవంత్ సర్కార్ చొరవపై కార్మికుల ప్రశంసలు

తెల్లవారుజాము నుంచే రోడ్డెక్కనున్న బస్సులు.. విలీనంపై కమిటీ.. పీఆర్సీకి గ్రీన్ సిగ్నల్

సెక్రటేరియట్‌లో 7 గంటల మారథాన్ చర్చల విజయం

ముగిసిన ప్రతిష్టంభన.. ప్రయాణికులకు భారీ ఊరట



**హైదరాబాద్, మహా:**

రాష్ట్రవ్యాప్తంగా గత కొన్ని రోజులుగా తీవ్ర ఉత్కంఠ రేకెత్తించిన ఆర్టీసీ సమ్మె వ్యవహారం ఎట్టకేలకు సుఖాంతమైంది. ప్రభుత్వంతో ఆర్టీసీ జేఏసీ నాయకులు జరిపిన చర్చలు సఫలం కావడంతో, కార్మికులు తమ ఆందోళనను విరమించేందుకు సిద్ధమయ్యారు. సుదీర్ఘ కాలం పాటు కొనసాగిన ఈ ప్రతిష్టంభన తొలగిపోవడంతో సామాన్య ప్రయాణికులకు పెద్ద ఊరట లభించింది. శుక్రవారం నాడు సచివాలయం వేదికగా జరిగిన ఈ కీలక సమావేశంలో ఇరుపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. ఫలితంగా శనివారం నాడు మొదటి షిఫ్టు నుంచే ఆర్టీసీ బస్సులు యథావిధిగా రోడ్డెక్కనున్నాయి. ఈ మేరకు కొద్దిసేపటి క్రితమే సచివాలయం నుంచి అధికారిక ప్రకటన వెలువడటంతో కార్మిక వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

**రేవంత్ సర్కార్‌పై ప్రశంసల జల్లు..**
**కేసీఆర్ పాలనతో పోలిక**

ఈ చర్చల సందర్భంగా ఆర్టీసీ జేఏసీ నేతలు రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం కార్మికుల పట్ల అత్యంత సానుకూలతతో ఉందని వారు అభిప్రాయపడ్డారు. "కేసీఆర్ పాలన కంటే మీరే బెటర్" అంటూ జేఏసీ నేతలు మంత్రుల కమిటీ ముందు వ్యాఖ్యానించడం

మిగతా 4లో

**సచివాలయంలో మారథాన్ చర్చలు..**
**మంత్రుల బృందం చొరవ**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో జరిగిన ఈ చర్చలు దాదాపు 7 గంటల పాటు అత్యంత ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ సమావేశంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు మరియు అడ్లూరి లక్ష్మణ్ పాల్గొని జేఏసీ నాయకులతో విడతల వారీగా చర్చలు జరిపారు. జేఏసీ నాయకులు తమ 32 డిమాండ్లపై వెనక్కి తగ్గకుండా పట్టుబట్టగా, ప్రభుత్వం కూడా సానుకూల ధోరణితో స్పందించింది. 32 డిమాండ్లలో 29 డిమాండ్లకు ప్రభుత్వం చర్చల ప్రారంభంలోనే పచ్చజెండా ఊపినప్పటికీ, మిగిలిన మూడు కీలక డిమాండ్లపైనే సందిగ్ధత కొనసాగింది. అయితే, భట్టి విక్రమార్క తనదైన శైలిలో మధ్యవర్తిత్వం వహించి సమస్యను కొలిక్కి తెచ్చారు.

## ఆప్‌ను చీల్చిన రాఘవ్ చడ్డా

**ఏడుగురు ఎంపీలతో కమలం గూటికి...**



**ఢిల్లీ, మహా:** జాతీయ రాజకీయాల్లో పెను సంచలనం చోటుచేసుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు అత్యంత ఆప్తుడిగా, పార్టీలో కీలక వ్యూహకర్తగా పేరున్న రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చడ్డా తనతో పాటు మరో ఆరుగురు ఎంపీలతో కలిసి భారతీయ జనతా పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన ఒక నాటకీయ పరిణామంలో, రాజ్యసభలోని ఆప్ పార్లమెంటరీ పక్షాన్ని బీజేపీలో విలీనం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఎగువ సభలో ఆప్‌కు ఉన్న మొత్తం 10 మంది సభ్యుల్లో ఏడుగురు అంటే.. సరిగ్గా మూడింట రెండొంతుల (2/3) వంతు మంది సభ్యులు ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. ఈ తాజా పరిణామంతో ఫిరాయింపుల నిరోధక చట్టం నుంచి వీరు మినహాయింపు పొందే అవకాశం ఉండటంతో, వీరి సభ్యత్వానికి ఎటువంటి ముప్పు ఉండబోదని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. రాఘవ్ చడ్డాతో పాటు బీజేపీ బాట పట్టిన వారిలో సందీప్ పాఠక్, అశోక్ మిత్తల్, క్రికెట్

మిగతా 4లో

## ఎస్.ఎల్.బి.సి సొరంగ భద్రతపై ఎన్‌జీఆర్ఐ నివేదిక

- ప్రమాదాలకు తావులేకుండా తవ్వకాలు.. నెలకు 200 మీటర్ల లక్ష్యం
- మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల భూపరిశోధనల్లోనూ ఎన్‌జీఆర్ఐ భాగస్వామ్యం
- సచివాలయంలో మంత్రి ఉత్తమ్ సమీక్ష

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్.ఎల్.బి.సి) సొరంగ మార్గ పనుల్లో భద్రతా ప్రమాణాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సొరంగ మార్గం తవ్వకాల సమయంలో అనుసరించాల్సిన రక్షణ చర్యలపై నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ) రూపొందించిన సమగ్ర సర్వే నివేదికను శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఆయన స్వీకరించారు. ఎన్‌జీఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త సత్యనారాయణ ఈ నివేదికను మంత్రికి అందజేశారు. గతంలో సొరంగ మార్గ తవ్వకాల సమయంలో చోటు చేసుకున్న దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలనే పట్టుదలతో ప్రభుత్వం ఉందని, అందుకే శాస్త్రీయ మార్గదర్శకత్వంలో పనులను ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. తవ్వకాల ప్రక్రియలో ఎదురయ్యే ముందస్తు ప్ర



మాదాలను గుర్తించేందుకు ఎన్‌జీఆర్ఐ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం విశేషం. ముఖ్యంగా సీస్మిక్ ఇమేజింగ్, ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టొమోగ్రఫీ, వంటి పద్ధతుల ద్వారా భూగర్భంలోని పరిస్థితులను శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఈ నివేదికలో సొరంగ మార్గంలోని స్ట్రెస్ జోన్ లు, నీటి ఊటలు వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాలు,

మిగతా 4లో

## విరాట్ కోహ్లీ విశ్వరూపం

**ఆర్‌సీబీ చేతిలో గుజరాత్ చిత్తు**



**మహా :** బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్‌సీబీ మరోసారి విరుచుకుపడింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ బ్యాటర్లు అదరగొట్టారు. విరాట్ కోహ్లీ 81 పరుగులతో గుజరాత్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. సెంచరీ అయిపోతుందని అంతా ఆశపడినా.. కోహ్లీ అనూహ్యంగా ఔట్ అయ్యాడు. భారీ లక్ష్యం ముందున్నా ఏమాత్రం బెదరకుండా ఆర్‌సీబీ వీరోచిత విజయాన్ని అందుకుంది. సాయి సుదర్శన్ సెంచరీతో గుజరాత్ టైటాన్స్ నిర్దేశించిన 206 పరుగుల భారీ టార్గెట్‌ను బెంగళూరు బ్యాటర్లు మరో 7 బంతులు మిగిలి ఉండగానే ఊదేశారు. విరాట్ కోహ్లీ క్లాస్, దేవదత్ పడిక్కల్ మాస్ ఇన్నింగ్స్‌తో టైటాన్స్ బౌలింగ్‌ను చీల్చి చెండాడారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్‌కు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. సాయి సుదర్శన్ 58 బంతుల్లో 100 పరుగులు చేసి ఇన్నింగ్స్ హైలైట్‌గా నిలిచాడు. ఇతడి స్కోరులో 11 ఫోర్లు, 5 సిక్సర్లు ఉన్నాయి. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (32) సుదర్శన్‌కు మంచి సహకారం అందించాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 12.4 ఓవర్లలోనే 128 పరుగులు జోడించారు. మిడిల్ ఆర్డర్‌లో జోస్ బట్లర్ 16 బంతుల్లో 25 పరుగులు చేసి అవుట్ కాగా, చివర్లో వాషింగ్టన్ సుందర్ (19 నాటౌట్), జేసన్ హోల్డర్ (23 నాటౌట్) మెరుపులు మెరిపించారు. ముఖ్యంగా హోల్డర్ కేవలం 10 బంతుల్లోనే 2 సిక్సర్లతో విరుచుకుపడటంతో గుజరాత్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. ఆర్‌సీబీ బౌలర్లలో భువనేశ్వర్, హేజిల్‌వుడ్, సుయాష్ శర్మ తలో వికెట్ తీశారు.

మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | సంపాదకీయం | EDITORIAL | శుక్రవారం, హైదరాబాద్ | 24-04-2026

ANN తెలుగు

# ఏపీలో థర్డ్ పార్టీ

## జూలై తర్వాత పార్టీ పెడతా.. విజయసాయిరెడ్డి ప్రకటన



**హైదరాబాద్, మహా:** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో భాగంగా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి నివాసంలో జరిగిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు ఎట్టకేలకు ముగిశాయి. సుదీర్ఘ గంటల పాటు సాగిన ఈ తనిఖీల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేశారు. ఈడీ అధికారులకు తన వద్ద ఎలాంటి అక్రమ పత్రాలు గానీ, నగదు గానీ లభించలేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ సోదాలు జరిగాయని ఆరోపిస్తూనే, తన నిజాయితీని నిరూపించుకునేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని ధీమా వ్యక్తం చేశారు. అయితే, ఈ సోదాల కంటే ఆయన చేసిన రాజకీయ వ్యాఖ్యలే ఇప్పుడు ఏపీలో చర్చనీయాంశంగా మారాయి.

### ఏపీలో కొత్త పార్టీ అవసరం..మూడో ప్రత్యామ్నాయం దిశగా అడుగులు?

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితులపై విజయసాయిరెడ్డి స్పందిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌లో మరో రాజకీయ పార్టీ ఆవిర్భవించాల్సిన అవసరం ఉందన్న బలమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న పార్టీల పట్ల ప్రజల్లో ఒక రకమైన విముఖత ఉందనే భావనను ఆయన వ్యక్తపరుస్తూ, ప్రజా సమస్యలపై నిజాయితీగా పోరాడే సరికొత్త శక్తి రావాలని పిలుపునిచ్చారు. ఇది ఆయన కొత్త పార్టీ పెట్టబోతున్నారనే సంకేతమా? లేక ఇప్పటికే ఉన్న ఏదైనా జాతీయ పార్టీకి మద్దతుగా నిలిచేందుకా? అనే చర్చ మొదలైంది. ఆయన చేసిన ఈ ప్రతిపాదన ఏపీలోని రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చివేసేలా ఉంది.

### జూలైలో రాజకీయ పునరాగమనం..

గత కొంతకాలంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్న విజయసాయిరెడ్డి, తన పునరాగమనంపై స్పష్టతనిచ్చారు. వచ్చే జూలై నెలలో తాను మళ్లీ రాజకీయాల్లో క్రియాశీలకంగా మారతానని ప్రకటించారు. ఈ రెండు నెలల సమయాన్ని క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేయడానికి మరియు తన భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవడానికి ఉపయోగించుకుంటానని తెలిపారు. జూలైలో ఆయన చేసే ఆ ప్రకటన ఏపీ రాజకీయాల్లో ఒక భారీ ప్రకంపన సృష్టించబోతోందని ఆయన సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఏ పార్టీలో చేరతారనేది పక్కన పెడితే, ఆయన రాజకీయ రాక ఖచ్చితంగా అధికార, ప్రతిపక్షాలకు సవాలుగా మారనుంది. రాజకీయాలతో పాటు మీడియా రంగంలోకి కూడా ప్రవేశిస్తున్నట్లు విజయసాయిరెడ్డి ప్రకటించడం విశేషం. తనకంటూ ఒక బలమైన గొంతు ఉండాలని, ప్రజా సమస్యలను నిష్పక్షపాతంగా ఎండగట్టేందుకు ఒక మీడియా సంస్థను త్వరలోనే ప్రారంభించబోతున్నానని వెల్లడించారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన కసరత్తు పూర్తయిందని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన న్యూస్ ఛానల్ మరియు పత్రికను తీసుకురావాలని ఆయన యోచిస్తున్నారు. దీనివల్ల ఆయన రాజకీయ ప్రచారానికి మరియు ప్రత్యర్థుల విమర్శలను తిప్పికొట్టడానికి ఒక బలమైన వేదిక దొరికినట్లవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### లిక్కర్ కేసు నేపథ్యం..రాజకీయ కక్ష సాధింపా? చట్టబద్ధమైన చర్యలా?

ఏపీలో గత ప్రభుత్వం హయాంలో జరిగిన మద్యం పాలసీలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు జరిగాయి. ఈ కేసులో ఇప్పటికే పలువురు నేతలు మరియు అధికారులను ఈడీ ప్రశ్నించింది. విజయసాయిరెడ్డి ఈ కుంభకోణంలో భాగస్వామిగా ఉన్నారనే అనుమానంతోనే అధికారులు ఆయన నివాసంపై దాడులు నిర్వహించారు. అయితే, సోదాల అనంతరం తనకు ఎటువంటి సంబంధం లేదని ఆయన చెప్పడం, ఇదంతా కావాలనే సృష్టించిన వ్యవహారమని కొట్టిపారేయడం గమనార్హం. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, తాను దేనికైనా సిద్ధమని ఆయన స్పష్టం చేశారు.

### జగన్ తో విబేధాలు బహిర్గతం.. గులాబీ కోటలో ముసలం?

వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అత్యంత ఆప్తుడిగా, కుటుంబ సభ్యుడిగా మెలిగిన విజయసాయిరెడ్డి ఇప్పుడు ఇంత ఘాటుగా స్పందించడం వెనుక పెద్ద రాజకీయ కారణమే ఉందని తెలుస్తోంది. ముఖ్యంగా తనపై ఈడీ సోదాలు జరుగుతున్నప్పుడు పార్టీ నుంచి ఎలాంటి నైతిక మద్దతు లభించలేదనే కోపం ఆయనలో ఉంది. ఇది కేవలం విజయసాయిరెడ్డి వ్యక్తిగత నిర్ణయమా లేక వైకాపాలోని మరికొందరు నేతలు కూడా ఆయనతో టచ్ లో ఉన్నారా? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. పార్టీ సీనియర్ నేతలే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వైకాపా శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది.

### ఏపీలో రాజకీయ శూన్యత... విజయసాయి రెడ్డి విశ్లేషణ

రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ శూన్యతను తాను భర్తీ చేస్తానని విజయసాయిరెడ్డి భావిస్తున్నట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఉనికి లేకపోవడం, అధికార పార్టీ పట్ల వ్యతిరేకత, ప్రతిపక్షాల మధ్య సమన్వయ లోపం వంటి అంశాలను ఆయన అనుకూలంగా మార్చుకోవాలని చూస్తున్నారు. ప్రజలకు ఒక బలమైన ప్రత్యామ్నాయం కావాలని, ఆ దిశగా తన అడుగులు పడతాయని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. ఆయన అనుభవం, వ్యూహరచన ఏపీ రాజకీయాల్లో కొత్త సంచలనాలకు దారితీసే అవకాశం ఉంది. ఢిల్లీ స్థాయిలో బీజేపీ అగ్రనేతలతో మంచి సంబంధాలు కలిగిన విజయసాయిరెడ్డి, తన తదుపరి అడుగును ఎటువైపు వేస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఆయన బీజేపీలో చేరే అవకాశం ఉందనే ప్రచారం ఒకవైపు జరుగుతుంటే, సొంతంగా ప్రాంతీయ పార్టీ పెట్టి మూడో శక్తిగా ఎదగాలని ఆయన భావిస్తున్నట్లు మరికొందరు చెబుతున్నారు. ఏది ఏమైనా ఢిల్లీ రాజకీయాల్లో చక్రం తిప్పిన ఆయన, ఇప్పుడు నేరుగా ఏపీ రాజకీయాల్లో పాగా వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

# ఏపీ లిక్కర్ స్కామ్‌లో ఈడీ దాడులు

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికే నమోదైన ఈసీఐఆర్ ఆధారంగా ఇది రెండో విడత దర్యాప్తు అని, సోదాల సమయంలో కీలక ఆస్తి పత్రాలు, ఆర్థిక లావాదేవీల రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఐటీ సలహాదారు రాజ్ కేసిరెడ్డి వంటి ప్రముఖులపై ఈడీ తీవ్ర ఆరోపణలు చేసింది. విజయసాయి రెడ్డి మద్యం సరఫరా ఆర్డర్లను ప్రభావితం చేశారని, చెవిరెడ్డి నిధుల తరలింపు, విదేశీ పెట్టుబడుల వ్యవహారాలను పర్యవేక్షించారని ఈడీ పేర్కొంది. అలాగే మాజీ సీఎం జగన్ మాజీ కార్యదర్శి ధనంజయ రెడ్డి మద్యం కొనుగోలు వ్యవస్థల్లో మాన్యువల్ మార్పులు చేయాలని అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు సిట్, ఈడీ దర్యాప్తులో తేలింది. ఈ మొత్తం కుంభకోణానికి రాజ్ కేసిరెడ్డి ప్రధాన సూత్రధారి అని ఈడీ గుర్తించింది. ఏపీఎస్‌బీసీఎల్ అధికారులను తన గుప్పిట్లో పెట్టుకుని, మాన్యువల్ ప్రొక్యూర్‌మెంట్ సిస్టమ్ ద్వారా కొన్ని బ్రాండ్లకు అధిక ధరలు కల్పించి భారీగా కిక్‌బ్యాక్‌లు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సుమారు రూ. 3,200 కోట్ల నేరపూరిత ఆదాయాన్ని ఆదన్, లీలా డిస్టిలరీస్, ఇతర రియల్ ఎస్టేట్ సంస్థల ద్వారా మనీలాండరింగ్ చేశారని, కుటుంబ సభ్యుల పేర్లతో ఆస్తులు కొనుగోలు చేసి అసలు యాజమాన్యాన్ని దాచిపెట్టారని ఈడీ తన నివేదికలో వెల్లడించింది. వీరితో పాటు ఓఎస్‌డీ కృష్ణమోహన్ రెడ్డి మధ్యవర్తిగా వ్యవహరించగా, ట్యాగ్ డెవలపర్స్ యజమాని తాళ్ల అవినాష్ గౌడ్, ముప్పిడి అవినాష్ రెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి వంటి వారు నిధుల మళ్లింపు, తయారీదారులతో సమన్వయం వంటి కీలక బాధ్యతలు నిర్వహించినట్లు ఈడీ సోదాల్లో ఆధారాలు లభించాయి. ఈ పరిణామాలు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయంగా పెను సంచలనం సృష్టిస్తున్నాయి.

**ఇదివరకే 442 కోట్లు జప్తు చేసిన ఈడీ**

గత ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీబీసీఎల్) ద్వారా జరిగిన భారీ మద్యం కుంభకోణంలో ఈడీ 442 కోట్ల రూపాయల విలువైన ఆస్తులను ఇటీవల జప్తు చేసింది. మద్యం సేకరణ, సరఫరా, విక్రయాల్లో నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి ప్రభుత్వ ఖజానాకు వేల కోట్లు గండి కొట్టారని ఈడీ తన దర్యాప్తులో నిర్ధారించింది. డిజిటల్ చెల్లింపులను ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టి, కేవలం నగదు రూపంలోనే లావాదేవీలు నిర్వహించడం ద్వారా భారీ ఎత్తున నల్లధనం పోగుచేశారని గుర్తించారు. ఈ అక్రమ నిధులను వివిధ బినామీ సంస్థల ద్వారా స్థిరాస్తులుగా మార్చినట్లు ఆధారాలు లభిస్తున్నాయి. ఈ కుంభకోణంలో రాజ్ కేసిరెడ్డి, వాసుదేవ రెడ్డిలు కీలక పాత్రధారులుగా ఉన్నారని ఈడీ పేర్కొంది. గత ప్రభుత్వంలో వీరు రాష్ట్ర మద్యం పాలసీని తమకు అనుకూలంగా మార్చుకుని అక్రమాలకు తెరలేపారు. తమకు కావాల్సిన కంపెనీలకే మద్యం సరఫరా కాంట్రాక్టులు దక్కేలా చేయడం, తక్కువ నాణ్యత కలిగిన మద్యాన్ని సామాన్యులకు అధిక ధరలకు విక్రయించడం ద్వారా వచ్చిన వేల కోట్ల కమిషన్లను దారి మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ వ్యవస్థలను అడ్డం పెట్టుకుని సాగించిన ఈ భారీ దోపిడీలో బినామీ కంపెనీల నెట్‌వర్క్ కీలకంగా మారిందని ఈడీ గుర్తించింది. మద్యం సిండికేట్లుగా ఏర్పడి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, వ్యక్తిగత లాభాల కోసం ప్రజల ఆరోగ్యాన్ని కూడా పణంగా పెట్టారని ఈడీ పేర్కొంది. ఈ నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరెవరు ఉన్నారనే అంశంపై ఈడీ అధికారులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

# కవిత పార్టీ ప్రకటన నేడే

(మొదటిపేజీ తరువాయి)

సుమారు 40 నుంచి 50 వేల మంది కార్యకర్తలు తరలివస్తారని అంచనా వేస్తున్న నిర్వాహకులు, అందరికీ ఇబ్బంది కలగకుండా 60 వేల మందికి సరిపడా భోజన ఏర్పాట్లు చేశారు. 50 ఎకరాల పార్కింగ్ స్థలం, సభను స్పష్టంగా వీక్షించేందుకు 35 భారీ ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేయడం కవిత వ్యూహాత్మక బలప్రదర్శనకు నిదర్శనంగా కనిపిస్తోంది.

**బంజారాహిల్స్ వైపు భారీ ర్యాలీ..2000 కార్లతో గర్జించనున్న జాగృతి సైన్యం**

పార్టీ ప్రకటన అనంతరం కవిత భారీ రోడ్ షో ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత మేడ్చల్ నుంచి సుమారు 2000 కార్లతో బంజారాహిల్స్ వైపు భారీ ర్యాలీగా బయలుదేరనున్నారు. ఈ ర్యాలీ వివిధ నియోజకవర్గాలు మరియు పాతబస్తీ మీదుగా సాగి, పార్టీ కార్యాలయానికి చేరుకోనుంది. దారి పొడవునా వివిధ ప్రాంతాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరిస్తూ, కార్యకర్తల్లో ఉత్సాహం నింపేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ భారీ ప్రదర్శన ద్వారా తన బలాన్ని నిరూపించుకోవడమే కాకుండా, రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజధానిలో తన రాజకీయ ఉనికిని బలంగా చాటాలని ఆమె భావిస్తున్నారు.

**వామపక్షాల ఏకీకరణే లక్ష్యం..ఎర్రజెండాతో కవిత సరికొత్త దోస్తీ**

కవిత తన రాజకీయ ప్రయాణంలో వామపక్షాల తోడ్పాటును కీలకంగా భావిస్తున్నారు. అందుకే గత కొంతకాలంగా సీపీఐ, సీపీఎం వంటి లెఫ్ట్ పార్టీల నేతలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. కేరళలో సీపీఎం కూటమికి ఓటేయాలని ఆమె పిలుపునివ్వడం, భవిష్యత్తులో కమ్యూనిస్టు నాయకత్వంతో కలిసి నడిచేందుకు వేసిన బలమైన అడుగుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సామాజిక న్యాయం, ప్రజా సమస్యలపై పోరాడే శక్తులన్నింటినీ ఒకే తాటిపైకి తెచ్చేందుకు ఆమె పావులు కదుపుతున్నారు. ఇప్పటికే ఖమ్మం, పరిగి వంటి ప్రాంతాల్లో వివిధ సామాజిక సంఘాలతో కలిసి ఆమె చేసిన నిరసనలు ఈ ప్రగతిశీల కూటమికి పునాదులు వేసినట్లు స్పష్టమవుతోంది.

**మాజీ మావోయిస్టుల అండతో కొత్త రాజకీయం**

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'కు వ్యతిరేకంగా కవిత గళమెత్తడం విప్లవ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఆదివాసీల హక్కులు, పౌర హక్కుల పరిరక్షణ విషయంలో ఆమె తీసుకున్న స్పష్టమైన వైఖరి వల్ల మాజీ మావోయిస్టులు సైతం ఆమె వైపు మొగ్గు చూపుతున్నారు. అణగారిన వర్గాల గొంతుకగా మారడం ద్వారా తన రాజకీయ అస్తిత్వాన్ని బలపర్చుకోవాలని ఆమె యోచిస్తున్నారు. ఇప్పటికే పలువురు మాజీ మావోయిస్టు నేతలు ఆమెతో భేటీ కావడం, త్వరలోనే వారు కవిత పార్టీలో చేరే అవకాశం ఉండటం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ప్రజాస్వామ్య పంథాలో ఉంటూనే ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేయడమే తన లక్ష్యమని ఆమె చాటిచెబుతున్నారు.

**బీఆర్ఎస్ అసంతృప్త నేతలకు గాలం..గులాబీ కోటలో కవిత కన్నం**

పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కవిత ఇతర పార్టీల్లోని కీలక నేతలను ఆకర్షిస్తున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకత్వంపై అసంతృప్తిగా ఉన్న నేతలు ఆమెతో టచ్‌లో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన రాథోడ్ బాబూరావు వంటి నేతలు ఆమె సమక్షంలో చేరడం దీనికి నిదర్శనం. టికెట్లు రాని వారు, పార్టీలో నిరాదరణకు గురైన ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని తన పార్టీలోకి లాక్కోవడం ద్వారా 'కారు' పార్టీని దెబ్బకొట్టాలని కవిత వ్యూహరచన చేశారు. 25వ తేదీ సభలో మరికొందరు ముఖ్య నేతలు కవిత కండువా కప్పుకోనున్నట్లు తెలుస్తోంది, ఇది బీఆర్ఎస్‌కు ఎంతో కొంత నష్టం కలిగించే అవకాశం ఉంది.

**పరిషత్ ఎన్నికలే లక్ష్యం...గ్రామీణ ప్రాంతాల్లో 'జనం బాట' వ్యూహం**

రాబోయే జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలను కవిత చాలా సీరియస్‌గా తీసుకుంటున్నారు. 565 జడ్పీలు, 5675 ఎంపీటీసీ స్థానాల్లో తన పార్టీ తరపునే బీఫారమ్ లు ఇచ్చి పోటీ చేయించాలని ఆమె నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాల్లో బీఆర్ఎస్ బలహీనంగా ఉన్న చోట తన క్యాడర్‌ను మోహరించడం ద్వారా జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు సవాలు విసరాలని ఆమె భావిస్తున్నారు. ఇందుకోసమే గత రెండు నెలలుగా 'జనం బాట' పేరుతో చాలా జిల్లాల్లో పాదయాత్ర చేసి క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేశారు. ఈ ఎన్నికల్లో సాధించే ఫలితాలే తన పార్టీ భవిష్యత్తుకు పునాది అని ఆమె బలంగా నమ్ముతున్నారు.

**తండ్రి పంథాపై తిరుగుబాటు..బీఆర్ఎస్ వైఫల్యాలపై కవిత బాణాలు**

తండ్రి కేసీఆర్ అనుసరిస్తున్న విధానాలను కవిత బహిరంగంగానే తప్పుబడుతున్నారు. తెలంగాణ అనే పదాన్ని పార్టీ పేరు నుంచి తొలగించడాన్ని ఆమె తీవ్రంగా ఆక్షేపించారు. తన పార్టీలో 'తెలంగాణ' కచ్చితంగా ఉంటుందని, రాష్ట్ర ప్రజల వెలుగుల కోసమే పనిచేస్తామని ఆమె స్పష్టం చేశారు. మహిళలకు పార్టీలో, ప్రభుత్వంలో సరైన విలువ ఇవ్వలేదన్న విషయాన్ని ఎండగడుతూ, తన పార్టీలో మహిళా రిజర్వేషన్లు పాటిస్తానని ప్రకటించారు. బీసీ నినాదం ఎత్తుకోవడం, ఉద్యమకారులను విస్మరించిన కేసీఆర్ తీరును విమర్శించడం ద్వారా ఆమె అసలైన ఉద్యమ వారసురాలిగా తనను తాను ఆవిష్కరించుకునే ప్రయత్నం చేస్తున్నారు.



**ముందుకు సాగే ప్రణాళికలు..**
**యువతకు పెద్దపీట, ప్రగతిశీల ఎజెండా**

వచ్చే ఎన్నికల నాటికి ఒక స్పష్టమైన రాజకీయ శక్తిగా ఎదగడమే లక్ష్యంగా కవిత అడుగులు వేస్తున్నారు. కేవలం భావోద్వేగాలతో కాకుండా, పక్కా సిద్ధాంత బలంతో ముందుకు వెళ్లాలని ఆమె నిర్ణయించుకున్నారు. "తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా సాంస్కృతిక ముద్ర వేసుకున్న కవిత, ఇప్పుడు 'ప్రగతిశీల రాజకీయ యోధ'గా తనను తాను మార్చుకుంటున్నారు. కురువృద్ధులకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీల కంటే, యూత్‌కు పెద్దపీట వేస్తానని ఆమె ఇస్తున్న హామీలు యువతను ఆకర్షిస్తున్నాయి. ప్రగతిశీల ఎజెండా, వామపక్షాల అనుభవం, ఉద్యమకారుల ఆకాంక్షలతో కూడిన కవిత నూతన పార్టీ రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి ప్రకంపనలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

# ఆర్టీసీ సమ్మె సుఖాంతం

(మొదటిపేజీ తరువాయి)



చర్చనీయాంశమైంది. సమ్మె ప్రారంభించిన వెంటనే ముఖ్యమంత్రి స్పందించి మంత్రుల కమిటీని నియమించడం తమను ఆశ్చర్యానికి, సంతోషానికి గురిచేసిందని వారు పేర్కొన్నారు. సమస్యను నాన్చకుండా తక్షణమే పరిష్కరించేందుకు సీఎం చూపిన చొరవను కార్మిక నాయకులు బహిరంగంగానే అభినందించారు.

### పీఆర్సీ బకాయిలపై పట్టు.. విడతల వారీ చెల్లింపులకు అంగీకారం

ఈ చర్చల్లో పీఆర్సీ బకాయిల విడుదల అంశం ప్రధాన అడ్డంకిగా మారింది. బకాయిలను వెంటనే విడుదల చేయాలని జేఏసీ నేతలు పట్టుబట్టగా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కొంత సమయం కోరింది. ఆర్థిక అంశాలతో కూడుకున్న వ్యవహారం కావడంతో ఒక్కసారిగా నిధులు విడుదల చేయడం సాధ్యం కాదని మంత్రులు వివరించారు. దీనిపై ఇరు పక్షాల మధ్య సుదీర్ఘ తర్జనభర్జనలు జరిగిన అనంతరం, బకాయిలను విడతల వారీగా చెల్లించేందుకు ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు జేఏసీ నాయకులు సుముఖత వ్యక్తం చేయడంతో ఒక ప్రధాన చిక్కుముడి విడిపోయింది. ఇది కార్మికులకు ఆర్థికంగా పెద్ద ఊరటనిచ్చే నిర్ణయంగా భావిస్తున్నారు.

### విలీనంపై కీలక మలుపు.. కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం సమ్మతి

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్‌పై చర్చలు అత్యంత ఆసక్తికరంగా సాగాయి. విలీనం వల్ల కలిగే లాభనష్టాలను ప్రభుత్వం జేఏసీ నేతలకు వివరించింది. ముఖ్యంగా విలీనం చేపడితే భవిష్యత్తులో గుర్తింపు సంఘాల ఎన్నికలు మరియు పీఆర్సీ వంటి ప్రత్యేక అంశాలు ఉండవని మంత్రుల బృందం స్పష్టం చేసింది. అయితే, ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీని వేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. విలీనానికి ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించడం జేఏసీ సాధించిన అతిపెద్ద విజయంగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### గ్రేటర్ ఉద్యోగులకు భరోసా.. ఎలక్ట్రిక్ బస్సుల రాకతో బదిలీలు లేవు

రాబోయే రోజుల్లో ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెరగనున్న నేపథ్యంలో, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు తమను బదిలీ చేస్తారేమోనన్న ఆందోళనలో ఉన్నారు. ఈ అంశాన్ని జేఏసీ నేతలు మంత్రుల దృష్టికి తీసుకురాగా, ప్రభుత్వం కీలక హామీ ఇచ్చింది. ఎలక్ట్రిక్ బస్సుల రాక వల్ల ప్రస్తుతం ఉన్న సిబ్బందిపై ఎలాంటి ప్రభావం ఉండదని, గ్రేటర్ పరిధిలో ఎవరినీ బలవంతంగా బదిలీ చేయబోమని మంత్రులు స్పష్టం చేశారు. దీనివల్ల నగర పరిధిలోని వేలాది మంది కార్మికులకు ఉద్యోగ భద్రత లభించినట్లయింది. ప్రైవేటీకరణ భయాలను పటాపంచలు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఈ హామీ కార్మిక వర్గాల్లో హర్షాతిరేకాలను నింపింది.

### కారుణ్య నియామకాలకు మోక్షం.. పర్మినెంట్ చేస్తూ నిర్ణయం

చనిపోయిన కార్మికుల కుటుంబాలకు అండగా నిలిచే కారుణ్య నియామకాల విషయంలో ప్రభుత్వం అద్భుతమైన నిర్ణయం తీసుకుంది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను తక్షణమే పర్మినెంట్ చేసేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇది బాధితులకు మరియు వారి కుటుంబ సభ్యులకు పెద్ద ఊరటనిచ్చే అంశం. కేవలం తాత్కాలిక ప్రాతిపదికన కాకుండా, వారిని రెగ్యులరైజ్ చేయడం వల్ల వేలాది కుటుంబాల్లో వెలుగులు నిండనున్నాయి. సామాజిక బాధ్యతతో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చర్చల్లో ఒక మలుపుగా నిలిచింది. జేఏసీ నేతలు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ సమ్మె విరమణకు మొగ్గు చూపారు.

### కార్మికుల బెనిఫిట్స్ పై స్పష్టత.. దశల వారీగా అమలు

రిటైర్డ్ ఉద్యోగులకు మరియు సర్వీసులో ఉన్న వారికి అందాల్సిన వివిధ రకాల బెనిఫిట్స్ (ప్రయోజనాలు) విషయంలో కూడా ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చింది. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బెనిఫిట్స్‌ను దశల వారీగా కార్మికులకు అందజేస్తామని మంత్రులు వెల్లడించారు. ఆర్థిక భారం ఉన్నప్పటికీ, కార్మికుల సంక్షేమమే తమ ప్రాధాన్యతని మంత్రుల బృందం పేర్కొంది. జేఏసీ నాయకులు కోరిన విధంగా అన్ని ప్రయోజనాలను సమయానికి అందేలా చూడటం కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని కూడా ప్రభుత్వం తెలిపింది. ఈ సానుకూల స్పందనతో చర్చలు తుది దశకు చేరుకున్నాయి.

### ప్రజా రవాణా పునరుద్ధరణ.. ఉదయం నుంచే బస్సులు

చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమణ ప్రకటన వెలువడటమే ఆలస్యం, ఆర్టీసీ యంత్రాంగం బస్సులను సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. ఏప్రిల్ 25వ తేదీ శనివారం తెల్లవారుజాము నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల నుంచి బస్సులు బయటకు రానున్నాయి. సమ్మె వల్ల ఇబ్బంది పడిన ప్రయాణికులు ఇప్పుడు తమ ప్రయాణాలను యథావిధిగా ప్లాన్ చేసుకోవచ్చు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు వచ్చే వారికి, విద్యార్థులకు ఈ నిర్ణయం పెద్ద ఊరటనిచ్చింది. సమ్మె కాలంలో ప్రైవేట్ వాహనదారుల దోపిడీకి గురైన ప్రయాణికులు, ఇప్పుడు మళ్లీ ఆర్టీసీ సేవలు అందుబాటులోకి రావడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### రాజకీయ నాయకత్వ ప్రతిభ.. భట్టి విక్రమార్క వ్యూహం పారింది

ఈ ప్రతిష్టంభనను తొలగించడంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక పాత్ర పోషించారు. మంత్రుల బృందాన్ని సమన్వయం చేస్తూనే, జేఏసీ నాయకులతో ఓపికగా చర్చలు జరిపారు. ఒకవైపు ప్రభుత్వ ఆర్థిక పరిమితులను వివరిస్తూనే, మరోవైపు కార్మికుల న్యాయమైన కోరికలను తీర్చేందుకు ఆయన తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలను ఇచ్చాయి. అలాగే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మరియు ఇతర మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్ లు కూడా తమ శాఖల పరంగా ఎదురయ్యే సాంకేతిక సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపారు. ఈ సామూహిక నాయకత్వం వల్లనే ఒక పెద్ద సంక్షోభం నుంచి రాష్ట్రం గట్టెక్కిందని చెప్పవచ్చు. ప్రభుత్వం, కార్మికుల మధ్య ఏర్పడిన ఈ నూతన సయోధ్య భవిష్యత్తులో ఆర్టీసీ అభివృద్ధికి బాటలు వేయనుంది.

# గొడ్డలి పార్టీతో జాగ్రత్త

## టీడీపీ కార్యకర్తలతో చంద్రబాబు.. జగన్ పై తీవ్ర వ్యాఖ్యలు



**అమరావతి, మహా :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కిల్లర్ పార్టీతో టీడీపీ నేతలు అందరూ జాగ్రత్తగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. కిల్లర్ పార్టీ ఆలోచనా విధానాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి కౌంటర్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఏపీలో కిల్లర్ పార్టీ దారుణాలకు తెగబడుతోందని.. వారి ఆగడాలు చెల్లనివ్వమని హెచ్చరించారు. జగన్ అండ్ కో రోడ్ల మీదకు వస్తారని, రెచ్చగొడతారని, రప్పా రప్పా అంటారని, ప్రజలను ఇబ్బందులు పెడతారని, చర్యలు తీసుకుంటే రాజకీయ కక్ష అంటారని ఎద్దేవా చేశారు. శుక్రవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌ల శిక్షణా తరగతులకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. శిక్షణా తరగతులకు వచ్చిన క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో కాఫీ కబుర్లు కార్యక్రమం నిర్వహించి.. వారికి పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. తన జీవితంలో ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాను తప్ప... నేరగాళ్లతో ఏనాడూ పోరాడలేదని.. ఇది తనకు కొత్తగా ఉందని తెలిపారు. ఎన్నికలయ్యేదాకా మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యను వాడుకున్నారని... అధికారంలోకి వచ్చాక న్యాయం చేయాలని జగన్ చెల్లెలు వైఎస్ సునీతారెడ్డి అడిగితే సైలెంట్‌గా ఉండమని ఆమెను కూడా బెదిరించారని ఆగ్రహించారు. ఆస్తి విషయంలో తల్లి, చెల్లిపై ఎవరైనా కోర్టుకు వెళ్తారా..? అని మండిపడ్డారు. వైసీపీ సోషల్ సైకోలతో తప్పుడు ప్రచారాలు చేయిస్తున్నారని దుయ్యబట్టారు. వైసీపీ లాంటి పార్టీని తన జీవితంలో ఎప్పుడూ చూడలేదని ఎద్దేవా చేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని గొడ్డలి పార్టీ ఎమ్మెల్సీ హత్య చేశారని.. కోర్టులో సాక్ష్యం చెప్పినవారిని కూడా బెదిరించారని ధ్వజమెత్తారు. గొడ్డలి పార్టీ చేసే అరాచకాలను అనునిత్యం ప్రజలకు కేడర్ వివరిస్తూనే ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## ఎస్.ఎల్.బి.సి సొరంగ భద్రతపై ఎన్‌జీఆర్ఐ నివేదిక

(మొదటిపేజీ తరువాయి)

సొరంగం పైభాగంలోని భూమి పటుత్వం వంటి కీలక అంశాలపై స్పష్టమైన విశ్లేషణను అందించారు. కార్మికుల ప్రాణరక్షణే తమ ప్రథమ ప్రాధాన్యమని తెలిపిన మంత్రి, ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తల మార్గదర్శకాలకు అనుగుణంగానే ప్రతి అంగుళం తవ్వకం సాగుతుందని భరోసా ఇచ్చారు. పనుల పునరుద్ధరణ ప్రక్రియ ప్రస్తుతం వేగవంతంగా కొనసాగుతోందని, ఎలక్ట్రిక్ లోడర్లు మరియు భారీ డంపర్ల సాయంతో ఇప్పటివరకు 151.50 మీటర్ల తవ్వకం పూర్తయిందని వెల్లడించారు. సొరంగ మార్గ పనుల్లో వేగాన్ని పెంచేందుకు ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన యంత్రాంగాన్ని సమీకరిస్తోంది. దేశీయ మరియు విదేశీ సంస్థల నుంచి ఆధునిక సాంకేతికతను జోడించి, రెండు వైపుల నుంచి నెలకు సగటున 200 మీటర్ల చొప్పున తవ్వకాలు పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కేవలం ఎస్.ఎల్.బి.సి పనులకే పరిమితం కాకుండా, కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి కూడా ఎన్‌జీఆర్ఐ సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. మెడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ కోసం చేపట్టే భూపరిశోధన (సాయిల్ టెస్ట్) ప్రక్రియలో ఎన్‌జీఆర్ఐ భాగస్వామ్యం కావాలని మంత్రి సూచించారు.

# ఆప్‌ను చీల్చిన రాఘవ్ చడ్డా

(మొదటిపేజీ తరువాయి)

దిగ్గజం హర్భజన్ సింగ్, పారిశ్రామికవేత్త రాజిందర్ గుప్తా, విక్రమ్ సాహ్నీ, మరియు ఢిల్లీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న స్వాతి మలివాల్ ఉన్నారు. ఈ ఏడుగురిలో ఆరుగురు పంజాబ్ నుంచి ఎన్నికైన వారే కావడం గమనార్హం. "నేను నా రక్తమాంసాలతో ఈ పార్టీని నిర్మించాను, నా యవ్వనంలోని 15 ఏళ్లను ఆప్ కోసం ధారపోశాను. కానీ నేడు ఆ పార్టీ తన విలువలను కోల్పోయింది. కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేసే సంస్థగా మారింది. నేనొక సరైన వ్యక్తిని తప్పుడు పార్టీలో ఉన్నానని గత కొంతకాలంగా అనిపిస్తోంది," అని రాఘవ్ చడ్డా తన మనోవేదనను వెళ్లబోసుకున్నారు. అవినీతిపై పోరాటం పేరుతో అధికారం చేపట్టిన వారు నేడు అదే అవినీతిలో కూరుకుపోయారని ఆయన తీవ్రంగా విమర్శించారు.

ఈ పరిణామాలపై ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్రంగా స్పందించారు. బీజేపీ మరోసారి పంజాబీలకు వెన్నుపోటు పొడిచిందని, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన పార్టీలను విచ్ఛిన్నం చేయడమే ఆ పార్టీ లక్ష్యమని మండిపడ్డారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సైతం ఈ ఎంపీలను 'ద్రోహులు'గా అభివర్ణించారు. ఆ ఏడుగురు పంజాబ్ ప్రజల విశ్వాసాన్ని తాకట్టు పెట్టారని, కమలం పార్టీలో వారికి చివరకు అగౌరవమే మిగులుతుందని ఎద్దేవా చేశారు. శరద్ పవార్ పార్టీ, శివసేనలో ఉపయోగించిన అదే 'వాషింగ్ మెషీన్' రాజకీయాలను ఇప్పుడు ఆప్‌పై కూడా బీజేపీ ప్రయోగించిందని ఆయన ఆరోపించారు. పార్టీ సీనియర్ నేత సంజయ్ సింగ్ మాట్లాడుతూ.. రాఘవ్ చడ్డాకు పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ పదవులతో పాటు అత్యున్నత గౌరవాన్ని ఇచ్చిందని, అయినప్పటికీ ఆయన బీజేపీ పన్నిన కుట్రలో పావుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ చీలిక వెనుక గత కొద్ది వారాలుగా సాగుతున్న పరిణామాలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. రాజ్యసభలో ఆప్ ఉపనేతగా ఉన్న రాఘవ్ చడ్డాను ఆ పదవి నుంచి తొలగించి అశోక్ మిత్తల్‌కు అప్పగించడం, సభలో మాట్లాడేందుకు ఆయనకు సమయం ఇవ్వకూడదని పార్టీ నిర్ణయించడం వంటి అంశాలు ఈ దూరాన్ని పెంచాయి. అప్పట్లోనే "నేను గాయపడ్డాను, కాబట్టి ఇప్పుడు మరింత ప్రమాదకారిగా మారాను" అంటూ చడ్డా చేసిన వ్యాఖ్యలు ఈ విలీనానికి ముందస్తు సంకేతంగా నిలిచాయి. పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం ఆయనకు భద్రతను ఉపసంహరించుకున్న వెంటనే కేంద్రం 'జెడ్‌ప్లస్' కేటగిరీ భద్రత కల్పించడం కూడా ఈ వ్యూహంలో భాగమేనని తెలుస్తోంది. బీజేపీలో చేరిన తర్వాత రాఘవ్ చడ్డాకు కేంద్ర మంత్రిమండలిలో చోటు దక్కే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ఈ పరిణామంతో రాజ్యసభలో బీజేపీ బలం 113కు పెరగగా, ప్రతిపక్షాల ఐక్యతకు ఇది గట్టి దెబ్బగా మారింది.

# బీజేపీలో చేరట్లే.. మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి

**హైదరాబాద్, మహా :** గత కొన్ని రోజులుగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కుటుంబం పార్టీ మారుతున్నారంటూ జరుగుతున్న ప్రచారానికి ఆయన కోడలు ప్రీతి రెడ్డి తెరదించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీని కలిసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తాము బిజెపిలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలను ఆమె పూర్తిగా ఖండించారు. తాను బీజేపీ నేతలను కలవడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఏవీ లేవని ప్రీతి రెడ్డి స్పష్టం చేశారు. తమ యూనివర్సిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏఐ క్యాంపస్ ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించాలనే ఉద్దేశంతోనే ఆ పార్టీ కీలక నేతలను కలిసినట్లు వివరించారు. ప్రధానిని పిలుస్తున్నాం కాబట్టి, సహజంగానే బీజేపీ నాయకులతో సమన్వయం చేసుకోవాల్సి ఉంటుందని, అందుకే చంద్రశేఖర్ తివారీని కలిశానని ఆమె వెల్లడించారు. రెండు రోజుల కిందట.. మల్లారెడ్డి కుటుంబంతో సహా ప్రధాని మోదీని కలిశారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వారిని ప్రధాని వద్దకు తీసుకెళ్లారు.

### మల్లారెడ్డి బీఆర్ఎస్‌లోనే !

మల్లారెడ్డి పార్టీ మారుతున్నారంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో ఎంతమాత్రం నిజం లేదని ప్రీతి రెడ్డి తేల్చి చెప్పారు. మల్లారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. మాకు బీఆర్ఎస్ పార్టీ మీద, నాయకత్వం మీద పూర్తి గౌరవం ఉంది అని ఆమె పేర్కొన్నారు. కేవలం తమ విద్యాసంస్థల అభివృద్ధి, కార్యక్రమాల కోసమే ఇతర పార్టీల నేతలతో సంప్రదింపులు జరుపుతున్నామని, దానిని రాజకీయ కోణంలో చూడవద్దని కోరారు. తాను కేవలం బీజేపీ నేతలను మాత్రమే కాకుండా, అన్ని పార్టీల ప్రముఖులను కలుస్తుంటానని ప్రీతి రెడ్డి గుర్తు చేశారు. ఇందులో భాగంగానే ఇటీవల రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబును కూడా కలిసినట్లు ఆమె ప్రస్తావించారు. విద్యావేత్తగా తమ యూనివర్సిటీ కార్యక్రమాల నిమిత్తం ప్రభుత్వ పెద్దలను, వివిధ పార్టీల నేతలను కలవడం సాధారణ ప్రక్రియేనని ఆమె క్లారిటీ ఇచ్చారు.

# నైపుణ్యాభివృద్ధి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు



వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**మహా వరంగల్ బ్యూరో;** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో 99 రోజుల సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నైపుణ్య అభివృద్ధి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని నిరుద్యోగ యువతీ యువకులను ఉద్దేశించి మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి అత్యంత అవసరమని తెలిపారు.మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన నైపుణ్యాలను అభ్యసించడం ద్వారా ఉపాధి అవకాశాలను సులభంగా పొందవచ్చని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని యువత తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా వివిధ శాఖల ద్వారా అందిస్తున్న స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలపై అవగాహన పెంపొందించుకొని,యువత ఆత్మవిశ్వాసం, కృషి, పట్టుదల ఉంటే విజయాన్ని సాధించగలరని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి సీనియర్ ప్రొఫెసర్ నవీన్ యువత నైపుణ్య అవకాశాలను ఇలా పెంపొందించుకోవాలనే విధానాన్ని వివరించడం జరిగింది. కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ నుండి గణేష్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రతినిధి మురళి మాట్లాడుతూ వేస్ట్ మెటీరియల్ నుంచి విలువైన ఉత్పత్తి మెటీరియల్ ఎలా తయారు చేయాలి అనే దానిమీద యువతకు వివరించారు.ఈ సదస్సులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా యూత్ అండ్ స్పోర్ట్స్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 8న జరగబోయే జాబ్ మేళాలో వాల్ పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ, జి.సంధ్యారాణి, ఏపీ సీఈఓ రామ్ రెడ్డి,డిబిసిడిఓ పుష్పలత , సంక్షేమ శాఖల అధికారులునిరుద్యోగ ఉద్యోగ యువతీ యువకులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమ్మె ఉధృతి పెంచుదాం..

టిడిపి, సిపిఐ, బిసి సంఘం నేతల హెచ్చరిక..



**మణుగూరు, మహా :** ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో పరిస్థితులు రోజురోజుకూ ఉద్రిక్తంగా మారుతున్నాయి. సమ్మెకు మద్దతుగా తెలుగుదేశం పార్టీ, సిపిఐ, బీసీ సంఘం నాయకులు శుక్రవారం మణుగూరు డిపో వద్దకు చేరుకుని కార్మికులకు ఐక్యతాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమ్మె సమయంలో డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నాయకులు, ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణే ఈ ఘటనకు కారణమని ఆరోపించారు. శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అలాగే భద్రాచలం డిపోకు చెందిన కార్మికుడు లింగారెడ్డి పరిస్థితి విషమంగా ఉండటం పట్ల కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లు ఉద్యోగ భద్రత, పెండింగ్ వేతనాల చెల్లింపు, సేవా నిబంధనల పరిరక్షణ, కార్మిక సంక్షేమ పథకాల అమలు లాంటి సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు ఆవేశానికి లోనవకుండా శాంతియుతంగా పోరాటాన్ని కొనసాగించాలని సూచించారు. హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వట్టం నారాయణ దొర, వాసిరెడ్డి చలపతి రావు, మద్దెల భద్రయ్య, దుర్గ్యాల సుధాకర్, తోట రమేష్, బుర్ర సోమేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# లక్షణాలు లేకున్నా మలేరియా నిర్ధారణకు విస్తృత సర్వే..

**మణుగూరు, మహా :** జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శుక్రవారం ఏసింప్టొమేటిక్ ఫీవర్ సర్వే నిర్వహించారు. మణుగూరు మండల పరిధిలోని మారుమూల వలస ఆదివాసి గిరిజన గ్రామాలైన బుడుగుల, ఖమ్మం తోగు, బుగ్గ ప్రాంతాల్లో గ్రామస్థులందరికీ త్వరితగతిన గుర్తించే పరీక్షలు చేపట్టారు. ఈ సర్వేలో భాగంగా ఖమ్మం తోగు, బుగ్గ గ్రామాల్లో ఎవరికి మలేరియా లేదని నిర్ధారణ అయింది. కాగా బుడుగుల గ్రామంలో మూడు అనుమానిత కేసులను గుర్తించి, వారి రక్త నమూనాలను ప్రయోగశాలకు పంపించారు. ప్రజల్లో లక్షణాలు లేకపోయినా మలేరియా వ్యాప్తి ఉండే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ సర్వే నిర్వహించినట్లు ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది తెలిపారు. గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని, జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని వైద్య సిబ్బంది గ్రామస్తులకు సూచించారు.

# ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతిది ప్రజలకు తెలియజేయాలి

జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుమార్ దీపక్



మంచిర్యాల, మహా : ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం గురించి పాత్రికేయులు ప్రజలకు తెలియజేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుమార్ దీపక్ సూచించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ సమీకృత భవనంలో జిల్లా పౌర సంబంధాల అధికారి, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ కన్వీనర్ మాదంశెట్టి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అక్రిడిటేషన్ కమిటీ ప్రథమ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దినపత్రికలు, న్యూస్ చానళ్లు ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని తెలిపారు. 202628 సంవత్సరాలకు గాను ప్రభుత్వ ఉత్తర్వులు 252, ఆర్.టి. 103 ప్రకారం అర్హత గల వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేయడంలో కమిటీ ప్రభుత్వ ఉత్తర్వుల మార్గదర్శకాలను పాటించాలని వెల్లడించారు. సరైన గుర్తింపు, అర్హత లేనివారు పాత్రికేయులుగా చలామణి కావడంతో అసలైన పాత్రికేయులకు ఇబ్బందులు, అవమానాలు తలెత్తుతున్నాయని చెప్పారు. అక్రిడిటేషన్ కోసం ఆన్ లైన్ లో అందిన దరఖాస్తులను కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హత గల వారిని ఎంపిక చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు అల్లువెల్లి రమేష్ రెడ్డి, గొల్లపల్లి సిద్ధార్థ, పార్వతి సురేష్ కుమార్, దేగ సత్యనారాయణ, మొహమ్మద్ ఇమాద్ ఉద్దీన్, రూపిరెడ్డి ప్రకాష్ రెడ్డి, అయినంపూడి నవీన్ కుమార్, గొల్లన నరేష్, బెక్కం సదానందం, మొదంపురం సంతోష్, జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయ సిబ్బంది కొల్లూరి సంపత్ కుమార్, జి.రవితేజ, మంత్రి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతిది ప్రజలకు తెలియజేయాలి

జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుమార్ దీపక్



మంచిర్యాల, మహా : ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం గురించి పాత్రికేయులు ప్రజలకు తెలియజేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుమార్ దీపక్ సూచించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ సమీకృత భవనంలో జిల్లా పౌర సంబంధాల అధికారి, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ కన్వీనర్ మాదంశెట్టి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అక్రిడిటేషన్ కమిటీ ప్రథమ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దినపత్రికలు, న్యూస్ చానళ్లు ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని తెలిపారు. 202628 సంవత్సరాలకు గాను ప్రభుత్వ ఉత్తర్వులు 252, ఆర్.టి. 103 ప్రకారం అర్హత గల వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేయడంలో కమిటీ ప్రభుత్వ ఉత్తర్వుల మార్గదర్శకాలను పాటించాలని వెల్లడించారు. సరైన గుర్తింపు, అర్హత లేనివారు పాత్రికేయులుగా చలామణి కావడంతో అసలైన పాత్రికేయులకు ఇబ్బందులు, అవమానాలు తలెత్తుతున్నాయని చెప్పారు. అక్రిడిటేషన్ కోసం ఆన్ లైన్ లో అందిన దరఖాస్తులను కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హత గల వారిని ఎంపిక చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు అల్లువెల్లి రమేష్ రెడ్డి, గొల్లపల్లి సిద్ధార్థ, పార్వతి సురేష్ కుమార్, దేగ సత్యనారాయణ, మొహమ్మద్ ఇమాద్ ఉద్దీన్, రూపిరెడ్డి ప్రకాష్ రెడ్డి, అయినంపూడి నవీన్ కుమార్, గొల్లన నరేష్, బెక్కం సదానందం, మొదంపురం సంతోష్, జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయ సిబ్బంది కొల్లూరి సంపత్ కుమార్, జి.రవితేజ, మంత్రి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

# కాసిపేట 1ఎ గనిలో మ్యాన్ రైడింగ్ ను ప్రారంభం

ప్రారంభించిన సింగరేణి ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వేంకటేశ్వర్లు



**బెల్లంపల్లి ,మహా:**కార్మికుల సౌకర్యార్థం కాశిపేట 1ఎ గని లో మ్యాన్ రైడింగ్ యంత్రాన్ని సింగరేణి ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు శుక్రవారంనాడు లాంచనంగా ప్రారంభించారు. మందమర్రి ఏరియా కాసిపేట 1A గని మ్యాన్ రైడింగ్ చైర్ లిఫ్టింగ్ సిస్టంను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ కార్మికుల నడకను తగ్గించి చైర్ సిస్టం ద్వారా పని స్థలానికి సులువుగా వెళ్లేందుకు ఏర్పాటు చేసి కార్మికుల కు ఉపయోగంలోకి తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం సమావేశంలో ఉద్యోగుల ను ఉద్దేశించి డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గనిలో నాణ్యమైన బొగ్గు ఉన్నందున కార్మికులు వాటికి తీయుటకు కృషి చేయాలని యువ కార్మికులు సంస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదని అన్నారు ,సంస్థ అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు.జనరల్ మేనేజర్ రాధాకృష్ణ మాట్లాడుతూ గని భవిష్యత్ బాగుందని,కాసిపేట గని కార్మికులు కష్టపడి పనిచేసే తత్వం ఉన్నవారని ప్రశంసించారు.చుట్టు పక్కల గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేస్తున్నామని అన్నారు,గని విస్తీర్ణతకు కొంత ల్యాండ్ సేకరించడం జరిగిందని అన్నారు.బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్ మాట్లాడుతూ గనిఏర్పాట్ల లో డైరెక్టర్ పాత్ర ప్రధానమైనదనీ అన్నారు.కాసిపేట ఉద్యోగులు బొగ్గు రంగ పరిశ్రమ లో ఎన్నో రికార్డులు నెలకొల్పినారని నైపుణ్యం తో పనిచేసే ఉద్యోగులుఉన్నారని,గనికి నూన ఎస్ డి ఎల్స్ ,సేఫ్టీ మెటీరియల్స్ అందించాలని అన్నారు. గని ఏజెంట్ రాంబాబు మాట్లాడుతూ గనిలో నాణ్యత కల్గిన బొగ్గు ను తీస్తూ రక్షణతో పనిచేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ సతీష్, ఎస్ ఓ టు జి ఎం ప్రసాద్,పర్సనల్ మేనేజర్ అశోక్, ఇంజనీర్ ఝూ, బాబు,సలేంద్ర సత్యనారాయణ, మీనుగు లక్ష్మీ నారాయణ,రక్షణ అధికారి నిఖిల్, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్,హిమాలయ,సంక్షేమ అధికారి మీర్జా, కార్మిక నాయకులు బన్న లక్ష్మన్దాస్, రాజేందర్,సంతోష్,శ్రీనివాస్,రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# మా అబ్బాయి క్యాన్సర్ బారిన పడ్డాడు దాతలు సహకరించాలి

- వైద్యానికి 35 లక్షల అప్పు చేశాం మరో 20 లక్షలు కావాలట
- దాతలారా మా కుమారునికి ప్రాణ బిక్ష పెట్టండి



**మందమర్రి, మహా :** మా అబ్బాయి రిషికేశ్వర్ క్యాన్సర్ బారిన పడ్డాడు ఓ దాతలారా మాకు సహకరించాలని రోగి తల్లిదండ్రులు వేనవంక నారాయణ, శ్రీలతలు వేడుకుంటున్నారు. శుక్రవారం మందమర్రి పాత్రికేయులకు ఒక సుదీర్ఘ ప్రకటన జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము రెండవ జూన్ లో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. తమ గృహం మూడు సంవత్సరాల క్రితం విద్యుత్ ప్రమాదానికి గురై 10 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని వివరించారు. తాము ఇప్పుడిప్పుడే ఆర్థికంగా కోలుకుంటున్నామని చెప్పారు. ఈ క్రమంలోని మాయదారి బ్లడ్ క్యాన్సర్ రోగం మా అబ్బాయికి సోకి 35 లక్షల రూపాయల మేరకు ఖర్చు చేశామని తెలిపారు. ఇంకా మరో 20 లక్షల రూపాయల మేరకు వైద్య ఖర్చులు అవుతుందని వైద్యులు వెల్లడించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మా అబ్బాయి స్థానిక మాంటిసోరి పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడని అన్నారు. ఈ మా అబ్బాయి విషయంలో స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్థికంగా సహకరించి మా అబ్బాయి ప్రాణాలను నిలబెట్టాలని దీనస్థితిని వ్యక్తం చేశారు. గూగుల్ పే, ఫోన్ పే చేయదలచిన దాతలు 99491 56031 గల మొబైల్ నంబర్ కు పంపాలని స్పష్టం చేశారు.

# భద్రాచలం ఐటీసీ కార్మికుల మహా నిరసన



**బూర్గంపహాడ్ మహా :**ఐటీసీ భద్రాచలం పేపర్ బోర్డ్స్ యూనిట్ కార్మికుల న్యాయపరమైన డిమాండ్ల సాధనకై INTUC మిత్రపక్షాల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. 13వ వేతన ఒప్పందం ముగిసి 24 రోజులు గడుస్తున్నా, యాజమాన్యం నుండి సరైన స్పందన లేకపోవడంతో కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.ఈ నేపథ్యంలో, ఏప్రిల్ 24వ తేదీ (శుక్రవారం) ఉదయం 8:00 గంటల నుండి ఐటీసీ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ముందు (ADM Block) ప్రారంభించి, 24 గంటల పాటు నిరసన చేపట్టారు ₹22,000 ప్యాకేజీ: మెరుగైన వేతన ఒప్పందంలో భాగంగా ₹22,000 ప్యాకేజీని అమలు చేయాలి. 100% అన్‌లిమిటెడ్ మెడికల్: కార్మికులందరికీ పూర్తిస్థాయిలో (100%) అపరిమిత వైద్య సదుపాయాలు కల్పించాలి.13వ వేతన ఒప్పందం గడువు ముగిసినందున, తక్షణమే కొత్త ఒప్పందాన్ని కార్మికులకు ఆమోదయోగ్యంగా అమలు చేయాలి.ఈ సందర్భంగా INTUC అధ్యక్షులు శ్రీ గోనే రామారావు మరియు ప్రధాన కార్యదర్శి శ్రీ యారం పిచ్చి రెడ్డి మాట్లాడుతూ.. "కార్మికుల కష్టార్జితంతో లాభాలు గడిస్తున్న యాజమాన్యం, వారి కనీస అవసరాలను గుర్తించకపోవడం శోచనీయం. మా డిమాండ్లు నెరవేరే వరకు ఈ పోరాటం ఆగదు" అని స్పష్టం చేశారు.

# ప్రభుత్వ డిగ్రీకళాశాలలో దోస్త్ వాలంటరీ హెల్ప్ లైన్ సెంటర్

ఇంటర్ పాసైన విద్యార్థులు డిగ్రీ సీటు కోసం, సందేహాల నివృత్తి కోసం సంప్రదించవచ్చు: ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్



**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ అడ్మిషన్ల సందేహాల నివృత్తి, సలహాలు ఇవ్వడానికి దోస్త్ వాలంటరీ హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ప్రస్తుతం 202627 విద్యా సంవత్సరానికి గాను బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధకోర్సులలో అడ్మిషన్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. బిఏ జనరల్, బిఏ హానర్స్, బీకాం టాక్సేషన్, బీకాం బ్యాంకింగ్, బీకాం ఈ కామర్స్, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ బి జెడ్ సి, బీఎస్సీ ఎంపీసీ, బీఎస్సీ హార్టికల్చర్, బీఎస్సీ ఫిషరీస్ కోర్సులలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో డిగ్రీ సీట్లు ఉన్నాయని వివరించారు.ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కోరారు.

# బట్వాన్ పల్లి గ్రామపంచాయతీలో ఫర్నిచర్ కొనుగోలులో అవకతవకలు

- రికవరీ చేయాలని గ్రామ పంచాయతీ తీర్మానం
- పంచాయతీ సెక్రెటరీ కి ఫిర్యాదు చేసిన పాలకవర్గం



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి మండలం బట్వాన్పల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గత పాలకవర్గాలు ఫర్నీచర్ కొనుగోలుకోసం 30.07.2015 రోజున సుమారు 25,000 రూపాయలు, తేదీ 25.05.2022 రోజున సుమారురూ.40వేలు ,మొత్తం సుమారు రూ.65 వేలు విత్ డ్రా చేసి నట్లు అవకతవకలకు పాల్పడి ఫర్నిచర్ కొనుగోలు చేయలేదని సంబంధిత విషయంలో అధికారులు పోలీసుల విచారణ జరిపి రికవరీ చేయాలని ప్రస్తుత పాలకవర్గం పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయడం జరిగింది.అట్టి నిధులకు సమానమైన ఫర్నీచర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో లేనందున రికవరీ చేసి గ్రామపంచాయతీ స్వాధీనం చేసుకోవాలని గ్రామసభలో చర్చించి గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్ కి గ్రామపంచాయతీ సర్పంచ్ సింగతి రాజేష్ కి వినతిపత్రం వార్డు సభ్యులు జాడిఅరుణ,గంగాధరి అంకులు, పంజాల పవిత్ర, రత్నం సోమయ్య, దుర్గం సుమంతి, గ్రామస్తులు గోమాస వినోద్, దుర్గం హరిక్రిష్ణ , గోనె శేఖర్ , పంజాల శ్రీనివాస్, తదితరులు వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తోపాటు కార్యదర్శి సంబంధిత విషయంలో విచారణ జరిపి రికవరీ అయ్యేలా చూస్తామని హామీఇచ్చారు.

# అర్హులైన వారు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య



**మంచిర్యాల, మహా :**అర్హులైన వారు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య అన్నారు. శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధృవపత్రాల పంపిణీ కార్యక్రమానికి కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రజల ఆలోచనలో మార్పు రావాలని, ప్రభుత్వ పథకాలు అందుకుంటున్న ప్రజలు విద్య, వైద్యం మాత్రం ప్రైవేటు వైపే మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యాసంస్థలలో సకల సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.అంతేకాకుండా విద్యార్థులకు ఏకరూప దుస్తుల తయారీ అవకాశాన్ని స్వయం సహాయక సంఘాల మహిళలకు కల్పించి ఆర్థిక అభివృద్ధికి చేయూత అందిస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో భాగస్వామ్యులైన ఏ.పి. ప్రొడక్టివిటీ కౌన్సిల్ సంస్థ ప్రతినిధి లింగమూర్తిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పి.డి. సుభాష్, టి ఎం సి లు చంద్రయ్య, శ్రీధర్, శిక్షణ నిర్వాహకురాలు ఫర్హాన నాజ్, స్కిల్ ఇంచార్జ్ శబుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉదయం, సాయంత్రం నడక ఆరోగ్యానికి అవసరం

12 లక్షల వ్యయంతో వాకింగ్ ట్రాక్ ప్రారంభం



**మందమర్రి, మహా :**ఉదయం, సాయంత్ర వేలల్లో నడక ఆరోగ్యానికి అవసరమని సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ కె వెంకటేశ్వర్లు, ఆయన సతీమణి కె విజయలక్ష్మి వెంకటేశ్వర్లులు అన్నారు. శుక్రవారం సింగరేణి పాఠశాల మైదానంలో 12 లక్షల వ్యయంతో నిర్మించిన వాకింగ్ ట్రాక్ ను స్థానిక సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు ఎన్ శ్రీవాణి రాధాకృష్ణ, మందమర్రి ఏరియా జీఎం ఎన్ రాధాకృష్ణ లతో కలిసి ప్రారంభించారు. సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఈ వాకింగ్ ట్రాక్ ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. ఈ ట్రాక్ ను సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. వ్యాయామం, నడక ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వం లభిస్తుందని వారు వివరించారు. జీఎం రాధాకృష్ణ మాట్లాడుతూ వాకింగ్ ట్రాక్ కావాలని క్రీడాకారులు, కార్మికులు వినతి పత్రాలు తమకు అందజేశారని చెప్పారు. అందులో భాగంగా ఈ ట్రాకును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సింగరేణి పాఠశాల మైదానాన్ని, జిమ్ ను, ఓపెన్ జిమ్ ను, యోగ శిక్షణను ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ 2 జీఎం జి.ఎల్ ప్రసాద్, సంగారెడ్డి గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, పీఎం సిహెచ్ అశోక్, ఎస్. శ్రీధర్, సూపర్ ఇంటెండెంట్ ఇంజనీర్ (సివిల్) , సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, తదితర సింగరేణి అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# ఆర్. కొత్తగూడెం పంచాయతీలో రైతులకు ఫార్మర్ రిజిస్టర్‌పై అవగాహన



**చర్ల మహా :** ఆర్. కొత్తగూడెం పంచాయతీ పరిధిలో రైతులకు ఫార్మర్ రిజిస్టర్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.సత్యనారాయణపురం వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) రామకృష్ణ గారు రైతులతో మాట్లాడుతూ, ఫార్మర్ రిజిస్టర్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు, పంట రుణాలు, బీమా సౌకర్యాలు పొందాలంటే ప్రతి రైతు తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే పేర్లు వచ్చిన రైతులు వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్.కొత్తగూడెం పంచాయతీ సర్పంచ్ రవి కుమార్ గారు పాల్గొని రైతుల సందేహాలను నివృత్తి చేశారు. రిజిస్ట్రేషన్‌కు అవసరమైన ఆధార్ కార్డు, భూమి పట్టాదారు పాస్‌బుక్, బ్యాంకు ఖాతా వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని రైతులకు తెలిపారు. గ్రామంలోని పొలాల వద్ద జరిగిన ఈ సమావేశానికి పలువురు రైతులు హాజరయ్యారు.

# కొండే బ్లాక్ బెల్ట్ ప్రదానోత్సవం ఘనంగా నిర్వహింపు



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలోని ITCPSPD మయూర్ స్కూల్‌లో శుక్రవారం రోజు న ఘనంగా బ్లాక్ బెల్ట్ ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో "Mitsuya Kai Hayashiha ShitoRyu Karate Do India" సంస్థకు చెందిన సీనియర్ కోచ్ జి. చెన్నార్ గారి ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్లాక్ బెల్ట్ మరియు సీనియర్ బ్రౌన్ బెల్ట్ పరీక్షలు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ITCఅధికారులు, రిటైర్డ్ టీచర్ కొండే ఓజా, సారపాక కొండే ఓజా, అలాగే ITCPSPD మేయూర్ స్కూల్‌కు చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. మొత్తం 60 మంది విద్యార్థులు ఈ బెల్ట్ పరీక్షల్లో పాల్గొన్నారు. ఇటీవల సీనియర్ కరాటే మాస్టర్ జి. చెన్నార్ గారి చేతుల మీదుగా విద్యార్థులకు "సర్టిఫికేట్ ఆఫ్ బెల్ట్" ప్రదానం చేయడం జరిగింది. వీరు విద్యార్థులందరూ కరాటే ఒలింపియాడ్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా సీనియర్ కరాటే ఇన్‌స్ట్రక్టర్స్ జి. వెంకట్రావు, జి. నాగేష్ మరియు ఇతరులు విద్యార్థులను అభినందించారు.

## వేపలగడ్డలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం





**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం వేపలగడ్డ గ్రామపంచాయతీలో ప్రజాసౌకర్యార్థం సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, గ్రామాభివృద్ధే లక్ష్యంగా సుమారు రూ.8 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులను చేపట్టడం జరిగింది.నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సహకారంతో, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకుల సమన్వయంతో ఈ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. వేపలగడ్డ సర్పంచ్ శ్రీమతి బొల్లి నిరోషా స్వయంగా పనులను ప్రారంభించి, గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి తమ పంచాయతీ కట్టుబడి ఉందని తెలిపారు. గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు కూడా తగ్గుతాయని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా స్థానిక ఉప సర్పంచ్ రామమ్మ, మాజీ జడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందిస్తున్న సహకారం అభినందనీయమని తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని దశలవారీగా అమలు చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు, స్థానిక గ్రామస్థులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సీసీ రోడ్ల నిర్మాణ పనుల ప్రారంభాన్ని స్వాగతించారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు

## ధాన్యం కొనుగోళ్లలో జాప్యం..

### అగ్రికల్చర్, పీఏసీఎస్ అధికారులను రైతు వేదికలో నిలదీసిన రైతులు



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలంలో ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ రైతులు తీవ్ర ఆందోళనకు దిగారు. బూర్గంపహాడ్ రైతు వేదిక ముందు పెద్ద ఎత్తున చేరుకున్న రైతులు అగ్రికల్చర్ అధికారిని, PACS అధికారులను రైతు వేదికలో నిలదీసి తలుపులు వేసి నిరసన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం వల్ల తమకు తీవ్ర నష్టం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.పంటను ఎంతో కష్టపడి పండించినప్పటికీ, కొనుగోలు కేంద్రాల్లో సరైన స్పందన లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు ధాన్యం క్వాలిటీ పేరుతో కొనుగోళ్లు ఆలస్యం చేస్తున్నారని, గ్లాసుల్లో ధాన్యం తీసుకుని పరిశీలిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అగ్రికల్చర్ అధికారి ధాన్యం నాణ్యతపై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో రైతులు తీవ్ర ఆగ్రహానికి గురై అధికారిపై తిరగబడ్డారు.ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించకపోతే పురుగుల మందు తాగి ఆత్మహత్యలకు పాల్పడతామని రైతులు హెచ్చరించారు. అప్పులు చేసి సాగు చేసిన పంటను కొనుగోలు చేయకపోతే కుటుంబాలను పోషించడం కష్టమవుతోందని, ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస వసతులు కూడా లేకపోవడం రైతుల సమస్యలను మరింత పెంచుతోంది. మంచి నీటి సౌకర్యం లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండలో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, విశ్రాంతి తీసుకునేందుకు సరైన ఏర్పాట్లు కూడా లేవని వాపోయారు.రైతుల ఆందోళనతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని, రైతులకు తాగునీరు, నీడ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు.

## సారపాక గ్రామపంచాయతీలో ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక గ్రామపంచాయతీ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉప సర్పంచ్ కన్నిదారి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామసభను ఏర్పాటు చేసి గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యలు, పంచాయతీ పాలనలో ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ కన్నిదారి రమేష్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధికి పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకమని పేర్కొన్నారు. గ్రామ స్థాయి పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరిగితేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి గ్రామస్తుడు గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామి కావాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గ్రామ సభలో పంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, తాగునీటి సమస్యలు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రోడ్ల నిర్మాణం, కాలువల మరమ్మతులు తదితర అంశాలపై గ్రామస్తులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని పాలకవర్గ సభ్యులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, పలువురు పాలకవర్గ సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామస్థులు గ్రామాభివృద్ధికి కలిసి పనిచేయాలని వ్యక్తం చేశారు.

## ఆర్. కొత్తగూడెం గ్రామపంచాయతీలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు



**చర్ల మహా :**గ్రామపంచాయతీల సక్రమ నిర్వహణే దేశ ప్రగతికి, అభివృద్ధికి సూచిక అని సర్పంచ్ తుర్రం రవి కుమార్ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్. కొత్తగూడెం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందల బుచ్చిబాబు ఆత్మ కమిటీ చైర్మన్ గారు మాట్లాడుతూ, గ్రామాల సమగ్ర అభివృద్ధికి పంచాయతీరాజ్ వ్యవస్థ పునాది అని, 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామ పాలనకు బలం చేకూరిందని తెలిపారు. ప్రజా పరిష్కారం ప్రజా పాలన పారదర్శకత, గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యంపై ఆవశ్యకత. వివిధ సమస్యలపై చర్చించారుఈ కార్యక్రమంలో సర్పంచ్ తుర్రం రవి కుమార్, పంచాయతీ సెక్రటరీ శోభ రాణి, ఉప సర్పంచ్ కాపుల కృష్ణ అర్జునరావు,ఇందల బుచ్చిబాబు ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల రమేష్ బాబు, జోగి రాజుగా, కొమరంభద్రయ్య, చింతకాయల రవీంద్రవార్డు, కనితి రజిని మెంబర్లు, దల్లి రామ్ రెడ్డి ,గౌరస పవన్ చారి లంక సాగరు వేల్పుల కామయ్య, చిమిడి సాంబయ్య, కరుకు సూరిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వృత్తి నైపుణ్యంతోనే పుష్కలంగా ఉపాధి అవకాశాలు

- ప్రభుత్వ పథకాలతో ఆర్థిక స్వావలంబన సాధించాలి
- నవ లిమిటెడ్ సేవలు అభినందనీయం
- జిల్లా కలెక్టర్ అంకిత్
- తాటాకులతో బుట్టల తయారీ వల్ల వచ్చిన నగదుతో కూడిన రూ.63821 చెక్కు అందజేత





**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**నైపుణ్యాభివృద్ధితో యువతకు విస్తృత ఉపాధి లభిస్తాయని ప్రభుత్వ పథకాలతో ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ వారం కార్యక్రమాలలో భాగంగా పాల్వంచలో శుక్రవారం నవ ఒకేషనల్ లో నైపుణ్యాభివృద్ధి అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ కేంద్రంలో జరుగుతున్న కార్యకలాపాలను సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందుతున్న మహిళలు, పురుషులతో కలెక్టర్ ప్రత్యక్షంగా మట్లాడి వారికి అందుతున్న శిక్షణ నాణ్యత శిక్షణ కాలవ్యవధి శిక్షణ అనంతర ఉపాధి అవకాశాలు ఉత్పత్తుల మార్కెటింగ్ విధానాలు ఆదాయ సాధన అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. శిక్షణార్థుల అభిప్రాయాలను తెలుసుకుని శిక్షణను మరింత ఫలప్రదంగా నిర్వహించేలా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.శిక్షణ పొందిన అభ్యర్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలతో పాటు ప్రైవేటు సంస్థల్లో అలాగే విదేశాల్లో కూడా ఉపాధి పొందడం గర్వకారణమని కలెక్టర్ అన్నారు. కొంతమంది స్వయం ఉపాధి ద్వారా తమ జీవనోపాధిని స్థిరపరచుకోవడం ప్రోత్సాహకరమని అన్నారు. ప్రస్తుత కాలంలో వృత్తి విద్యకు ఉన్న ప్రాధాన్యతను యువత సరిగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సంప్రదాయ విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు కలిగి ఉంటేనే ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని తెలిపారు. కేవలం డిగ్రీలు పొందడం సరిపోదని, ఉద్యోగ రంగం అవసరాలకు అనుగుణంగా ప్రాక్టికల్ స్కిల్స్‌ను అభ్యసించడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం పరిశ్రమలు సర్వీస్ రంగాలు నైపుణ్యంతో కూడిన సిబ్బందిని కోరుకుంటున్నాయని వెల్డింగ్ ఎలక్ట్రికల్ ప్లంబింగ్ ఫిట్టింగ్ సోలార్ టెక్నాలజీ మెషిన్ ఆపరేషన్ డిజిటల్ సర్వీసులు వంటి రంగాల్లో శిక్షణ పొందిన వారికి మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ కోర్సులు తక్కువ కాలంలో నేర్చుకునే వీలుతో పాటు త్వరగా ఉపాధి పొందే అవకాశం కల్పిస్తాయని తెలిపారు. వృత్తి విద్య కేవలం ఉద్యోగాలకు మాత్రమే పరిమితం కాకుండా స్వయం ఉపాధికి కూడా బలమైన మార్గం చూపుతుందని అన్నారు. శిక్షణ పొందిన యువత చిన్న స్థాయిలో యూనిట్లు ప్రారంభించి క్రమంగా వ్యాపారాలను విస్తరించుకోవచ్చని దీనివల్ల ఇతరులకు కూడా ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో జపాన్, రష్యా వంటి దేశాలు వృత్తి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తున్నాయని అదే విధంగా మన దేశంలో కూడా నైపుణ్యాభివృద్ధి ద్వారా ఆర్థిక పురోగతిని సాధించవచ్చని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ పథకాలను యువత పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలు పథకాలను సమర్థవంతంగా వినియోగించుకుని యువత స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. చేతివృత్తులకు గౌరవం పెంచుకుని చిన్న స్థాయిలో ప్రారంభించిన వ్యాపారాలను క్రమంగా అభివృద్ధి చేసుకుంటే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సదుపాయాలతో ఏటీసీ కేంద్రాల ద్వారా వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యం సాధించేలా విస్తృత కార్యక్రమాలు చేపడుతోందని సంప్రదాయ కోర్సులతో పాటు సోలార్ ఎనర్జీ, డిజిటల్ టెక్నాలజీ, ఆధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ పొందడం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని సూచించారు.అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేయడంతో పాటు చేతివృత్తుల ద్వారా గత నెలలో సాధించిన ఆదాయానికి గుర్తింపుగా చెక్కులను అందజేశారు.

**ఉపాధి లక్ష్యంగా...**

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా “నవ భారత్ వొకేషనల్ ఇనిస్టిట్యూట్” ద్వారా పరిసర ప్రాంతాల పేద యువతకు వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఫిట్టర్, సోలార్ టెక్నీషియన్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో నాణ్యమైన ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఇప్పటివరకు 2200 మందికి స్టైఫండ్‌తో కూడిన శిక్షణ అందించగా, ప్రస్తుత సంవత్సరంలో 80 మందికి శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు.

**మహిళా సాధికార కేంద్ర ప్రతినిధి ఎమ్. శ్రీనివాసరావు మాట్లాడుతూ...**

మహిళా సాధికార కేంద్ర ప్రతినిధి ఎమ్. శ్రీనివాసరావు మాట్లాడుతూ 1975లో నవభారత్ సంస్థ ప్రారంభించిన నాటి నుండి సంస్థ అభివృద్ధితో పాటు పరిసర ప్రాంతాలలో మౌలిక వసతులకు ఆనాడే శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈ మహిళా సాధికార కేంద్రంలో ఇప్పటివరకు 4600 మందికి పైగా వివిధ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్నారని నవ ఒకేషనల్ ఇన్స్టిట్యూట్ నందు అనేక మందికి పైగా శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా టాలీ వెల్డింగ్ యోగ్యత పత్రాలు, తాటాకులతో బుట్టల తయారీ వల్ల వచ్చిన నగదు రూ.63821 చెక్కును అందచేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా సాధికార కేంద్ర ప్రతినిధి ఎమ్. శ్రీనివాసరావు, హెచ్.ఆర్ ఏ. శ్రీనివాస్ రెడ్డి, సి.హెచ్ శ్రీనివాసరావు సి.ఎస్ ఆర్ మేనేజర్, సిపిఓ సంజీవరావు, తహసీల్దార్ ధారా ప్రసాద్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, బీసీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి ఉపేందర్, ఏపీఎం వెంకయ్య, మహిళా సాధికారిక ప్రతినిధులు, నవ ఒకేషనల్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు తూట్లు పొడిచిన బిజెపి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** డీ లిమిటేషన్ ముసుగులో మహిళా రిజర్వేషన్ బిల్లుకు బిజెపి ప్రభుత్వం తూట్లు పొడిచిందని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వై.శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కూలీ లైన్ 55వ డివిజన్ లో జరిగిన మహిళ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ ప్రతిపక్షాలు ఎప్పుడూ అనుకూలమేనని పేర్కొన్నారు. 2011లోనే సోనియా గాంధీ కాంగ్రెస్ నేతృత్వంలో కొనసాగిన యూపీఏ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును రాజ్యసభలో ఆమోదించడం జరిగిందని తెలిపారు. లోక్ భలో ఆనాడు బిజెపి మిత్రపక్ష పార్టీలు ఈ బిల్లును అడ్డుకోవటం జరిగిందని చెప్పారు. తిరిగి 2014నుండి అధికారంలో ఉన్న బిజెపి మోడీ సర్కార్ మహిళా రిజర్వేషన్ బిల్లును ఎందుకు అమలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రతిపక్షాలు మహిళా సంఘాలు దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా తిరిగి 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ ప్రతిపక్షాల పక్షాల సపోర్టుతో చట్టంగా రూపొందించడం జరిగిందని చెప్పారు. కానీ మోడీ ప్రభుత్వం 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఈ బిల్లును అమలు చేయకుండా 2026 27 సెన్సెక్స్ ప్రకారంగా జనాభా లెక్కల ప్రకారంగా డిలిమిటేషన్ చేసి సీట్లు పెంచిన తర్వాత రిజర్వేషన్లు మహిళలకు ఇస్తామని ఎన్డీఏ ప్రభుత్వం అడ్డుకట్ట వేయటం జరిగిందని దీన్ని దేశ ప్రజలు మహిళలు గమనించాలని చెప్పారు. తిరిగి దేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఆగమేఘాల మీద మహిళల మీద కపట ప్రేమను వలకబోస్తూ డీలిమిటేషన్ తో లింకు పెట్టి మహిళా రిజర్వేషన్ బిల్లు అమలకు 131 రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో పెట్టడం జరిగిందని దీనిని కాంగ్రెస్ ప్రతిపక్షాలు వ్యతిరేకించిన విషయం దేశ ప్రజలందరికీ తెలుసని డిలేమిటేషన్ వలన దక్షిణాది రాష్ట్రాలలో సీట్లు కోల్పోయి ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు పెరిగి తిరిగి బిజెపి అధికారంలో రావడానికి బిజెపి సాగిస్తున్న కుట్రపూరిత వైఖరిని జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ దేశంలో ఉన్న ప్రతిపక్ష పార్టీల నేతలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు గళం విప్పటం జరిగిందని చెప్పారు. డి లిమిటేషన్ తో లింకు లేకుండా 2023 నుండి చట్టం రూపంలో అమలులోకి వచ్చిన రిజర్వేషన్ బిల్లును 2024 ఎన్నికల్లో ఎందుకు అమలు చేయలేదని ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. బిజెపి మోడీ సర్కార్ అవలంబిస్తున్న కుట్రపూరిత విధానాలను దేశ ప్రజలు మహిళలు మేధావులు గమనిస్తున్నారని ఇప్పటికైనా కుట్రపూరిత విధానాలు మానుకొని చిత్తశుద్ధితో మహిళా రిజర్వేషన్లు బిల్లును అమలు చేసి చట్టసభల్లో 33 శాతం సీట్లు మహిళలకు ఇవ్వాలని, డి లిమిటేషన్ ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగబద్ధంగా సీట్ల సంఖ్యను పెంచాలని తద్వారా ఈ దేశ ఐక్యతకు భంగం కలగకుండా ప్రజాస్వామ్య సూత్రాలకు ఆటంకం కలగకుండా చూడాలని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో 55వ డివిజన్ కార్పొరేటర్ సింగర్ హరిహరన్, మాజీ కౌన్సిలర్ యరమల ఇందిర, మహిళ కాంగ్రెస్ నాయకులు ఇరుగురాల లక్ష్మి, గూడెపు నాగమణి, చిప్పా లక్ష్మీ, పొట్లకాయల నాగమణి, కార్ శోభ, బండి సుభద్ర, లక్ష్మి, వాడపల్లి సావిత్రి, కర్నాటి శోభ, బండి భవాని తదితరులు పాల్గొన్నారు.

## పూర్తిస్థాయిలో బొగ్గు రవాణాకు ఏర్పాట్లు

- ఇక్కడ నుండి రోజుకు 50 వేల టన్నుల వరకు బొగ్గు రవాణా జరపాలి
- ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకు నుండి ఈ ఏడాది 60 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి రవాణా సాధించాలి
- నైనీ బొగ్గు రవాణాకు ప్రత్యేక చొరవ చూపించాలి
- సమీక్షా సమావేశంలో సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశం




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఏడాదికి కోటి టన్నులకు పైగా బొగ్గు రవాణా జరుపుతున్న జేవీఆర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ లో సాంకేతిక సమస్యలను అధిగమించి ఈ ప్లాంటు నుండి పూర్తి స్థాయిలో బొగ్గు రవాణా జరిగే విధంగా చూడాలని సగటున రోజుకు 45 నుండి 50 వేల టన్నుల బొగ్గు రవాణా చేయాలని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశించారు. అలాగే ఒడిశా లోని నైనీ బ్లాక్ నుండి ఏడాది 60 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని బొగ్గు రవాణాలో తలెత్తిన అవరోధాలను అధిగమించాలని స్థానిక ప్రభుత్వ అధికారులు ప్రజల సహకారంతో లక్ష్యాలు సాధించాలని పిలుపునిచ్చారు.శు క్ర వా రం సింగరేణి భవన్ లో ఆయన ఈ రెండు కీలక అంశాల పైన ఉన్నతాధికారులు సంబంధిత అధికారులతో సమీక్షించారు. సత్తుపల్లి ఏరియా నుంచి ప్రతీ రోజు సుమారు 50 వేల టన్నుల బొగ్గు రవాణా చేయాల్సి ఉంటుందని కోల్ బంకర్లలో ఏర్పడిన సాంకేతిక సమస్యలను పరిష్కరించుకొని ఏరియా నుంచి బొగ్గు రవాణాకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆయన తెలిపారు. సత్తుపల్లి ఏరియాలో గల జేవీఆర్ 2 ఓపెన్ కాస్ట్ గని నుండి ఈ ఆర్థిక సంవత్సరం 11 మిలియన్ టన్నుల బొగ్గును కిష్టారం ఓపెన్ కాస్ట్ గని నుండి 24 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని సగటున రోజుకు సుమారు 45 నుండి 50 వేల టన్నుల బొగ్గు జేవీఆర్ సి.హెచ్.పి నుండి వినియోగదారులకు రవాణా జరపాల్సిన అవసరం ఉంటుందని కనుక సి.హెచ్.పి ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి తగు చర్యలను చేపట్టాలని చైర్మన్ ఆదేశించారు. ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ సి.హెచ్.పి సంపూర్ణ వినియోగానికి చేపడుతున్న చర్యలను వివరించారు. కాగా ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాకుకు ఈ ఏడాది 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించామని బొగ్గు ఉత్పత్తితో పాటు బొగ్గు రవాణా కూడా సమర్థంగా జరపాలన్నారు. అక్కడ కోల్ కారిడార్ రోడ్డు నిర్మాణం పూర్తవడానికి కొంత సమయం పడుతుంది కాబట్టి ఈలోపు సమీపంలోని రైల్వే సైడింగులకు రోడ్డు మార్గం ద్వారా బొగ్గును రవాణా చేయాలని ఈ విషయంలో స్థానిక ప్రభుత్వ అధికారులు స్థానిక ప్రజల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. నైనీ బొగ్గు బ్లాక్ నుండి సమీపంలోని రైల్వే సైడింగుల వరకు బొగ్గు రవాణా జరపడానికి తీసుకుంటున్న చర్యలను జనరల్ మేనేజర్ బైద్య వివరించారు. అలాగే ఈ గనిలో పనిచేయడానికి కావలసిన అధికారులు కార్మికులు సూపర్వైజర్ సిబ్బంది అవసరాన్ని కూడా ఆయన చైర్మన్ కు నివేదించారు. ఈ సమీక్ష కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్)ఎల్.వి సూర్యనారాయణ, డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్)కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్(ఈ అండ్ ఎం)ఎం.తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్)బి.వెంకన్న, జనరల్ మేనేజర్(మార్కెటింగ్ కోఆర్డినేషన్) టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా.. రేగాను పరామర్శించిన కాంగ్రెస్ నేత గురిజాల..



**మణుగూరు, మహా :** పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావును కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గురిజాల గోపి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల అస్వస్థతకు గురైన రేగా కాంతారావు హైదరాబాద్‌లో చికిత్స పొందిన అనంతరం స్వగ్రామమైన కరకగూడెంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న గురిజాల గోపి రాజకీయాలకు అతీతంగా కరకగూడెం చేరుకుని రేగాను కలసి ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ఆయనతో మాట్లాడిన గురిజాల, ఎవరు ఏ పార్టీలో ఉన్నా మానవత్వాన్ని మరువకూడదని పేర్కొన్నారు. రేగా కాంతారావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రేగాను పరామర్శించిన వారిలో రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ, సభ్యులు ఎండి షబానా, కోరి శ్యామల, రెడ్డి బోయిన రేణుక, డేరంగుల సుజాత, బాడిష పార్వతి, సౌజన్య డాకూరి తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళనానికి న్యాయవాదులకు ఆహ్వానం

### బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ముధాల్కర్ ని కలిసిన సమ్మేళన కమిటీ




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఈ నెల 26న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నిర్వహించనున్న హిందూ సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించి సమ్మేళనం కమిటీ సభ్యులు శుక్రవారం జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ముధాల్కర్ని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సమ్మేళనం యొక్క ఉద్దేశాలు కార్యక్రమ వివరాలు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను వివరించారు. సమాజంలో ఐక్యత ధర్మ పరిరక్షణ సాంస్కృతిక విలువల బలోపేతం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ముధాల్కర్, జనరల్ సెక్రటరీ గడిపెల్లి మహేశ్వరరావు కార్యక్రమానికి శుభాకాంక్షలు తెలియజేసి న్యాయవాదులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సూచించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ అన్ని న్యాయవాదులు హిందూ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు పి. వీరవర్ధనరావు, కార్యదర్శి లట్టి జగన్ మోహన్, ప్రచార కార్యదర్శి యెల్దండి పూర్ణచందర్ రావు, సభ్యులు గుర్రం వెంకట్ రెడ్డి, పిల్లి రాజేశ్వరరావు, గౌరవ సలహాదారులు పలివెల సాంబశివరావు, న్యాయవాదులు అనుబ్రోలు రాంప్రసాదరావు, శరత్, పప్పుల ప్రసాద్, నవీన్, దేవి ప్రసాద్, పి.నాగేశ్వరరావు, మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతులైన పౌరులే దేశానికి అసలైన సంపద

### జిల్లా అడిషనల్ కలెక్టర్ విద్యాచందన.. ఘనంగా పోషణ పక్వాడ ముగింపు కార్యక్రమం






**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఆరోగ్యవంతులైన పౌరులే దేశానికి అసలైన సంపదని జిల్లా అడిషనల్ కలెక్టర్ విద్యాచందన అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం మీటింగ్ హాల్లో జిల్లా మహిళా శిశు దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి జె.స్వర్ణలత లెనీనా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోషణ పక్వాడ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే, అక్షరభ్యాసం, అన్నప్రసనా, గర్భిణీలకు శ్రీమంతాలు, జిల్లా స్థాయిలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అత్యున్నత ప్రతిభ కనబరిచిన జిల్లా స్థాయి సిడిపివోలకు, సూపర్వైజర్లకు, పోషణ అభియాన్ సిబ్బందికి, అంగనవాడి టీచర్లకు మేమేంటో ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న అదనపు కలెక్టర్ విద్యచందన మాట్లాడుతూ ఆరోగ్యవంతులైనా పౌరులే దేశానికి అసలైన సంపదని మనం తీసుకునే ప్రతి ముద్ద మన ఆరోగ్యానికి పెట్టుబడి కావాలన్నారు. ఈ పోషణ పక్వాడా స్ఫూర్తిని ఈ 15 రోజులే కాకుండా ఏడాది పొడవునా కొనసాగించే విధంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యచరణ రూపొందించి అంగన్వాడి కేంద్రాలలో నమోదైన లబ్ధిదారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాలని కోరారు. 2026 పూర్తి అయ్యే నాటికి మన జిల్లా పోషకాహార లోప రహిత జిల్లాగా నిర్మించుకోవాలనే లక్ష్యంగా పెట్టుకొని క్షేత్రస్థాయిలో సిబ్బంది పని చేయాలని కేవలం ఆహారం తినడం వేరు, శరీరానికి కావలసిన విటమిన్లు, ఖనిజాలు అందేలా పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవడం వేరు అని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లేనినా మాట్లాడుతూ పోషణ పక్వాడ 2026 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉన్న 2061 అంగనవాడి కేంద్రాలలో నమోదైన లబ్ధిదారులతో పాటు ప్రజలలో కూడా పౌష్టికాహార విలువలపై అవగాహన పెంపొందించామని తెలిపారు. ఒక బిడ్డ ఆరోగ్యం తల్లి గర్భంలో ఉన్నప్పటి నుండే మొదలవుతుందని గర్భిణీ స్త్రీలు ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లతో పాటు ఆకుకూరలు పాలు గుడ్లు వంటి బలమైన ఆహారం తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు మొదటి ఆరు నెలలు తల్లి పాలు మాత్రమే ఇవ్వడం వల్ల ఆ బిడ్డకు జీవితాంతం అవసరమైన రోగనిరోధక శక్తి లభిస్తుందన్నారు. జిల్లాలో ఉన్న అన్ని అంగన్వాడి కేంద్రాలలో కాలానుగుణంగా సామూహిక వేడుకలైన అన్నప్రాసన, అక్షరాభ్యాసం, శ్రీమంతాలు నిర్వహించినట్లయితే పౌష్టికాహార విలువలపై ఆరు సంవత్సరాలలోపు పిల్లల ఎదుగుదలపై మరింత అవగాహన కల్పించినట్లయితే ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి భాగస్వామ్యులవుతారని తెలిపారు.

## పల్సర్ బైక్ దొంగలు అరెస్ట్



**జూలూరుపాడు, మహా:** పల్సర్ బైక్ ను దొంగిలించిన ముగ్గురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడి అరెస్ట్ అయిన సంఘటన శుక్రవారం జూలూరుపాడు లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాలి సురేష్ అనే వ్యక్తి బుధవారం రాత్రి మండల కేంద్రంలోని బండి రామనాథం ఇంటి ఎదురుగా ప్రధాన రహదారి పక్కన తన పల్సర్ బైకును పార్కు చేసి, నిద్రించాడు. మరసటి రోజు ఉదయం నిద్ర లేచి చూడగా, తన పల్సర్ బైక్ కనబడలేదు, తన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని దొంగలు అపహరించారని గమనించి దొంగల ఆచూకీ కనుగొనవలసిందిగా మాలి సురేష్ స్థానిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూలూరుపాడు ఎస్సై బాదావత్ రవి కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ఎస్సై రవి శుక్రవారం వాహన తనిఖీలో బైక్ ను దొంగిలించిన మామిడాల నీరజ్, నవీన్, మహమ్మద్ నాసిర్ లను గుర్తించి వారిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి పల్సర్ బైకును పంచుల సమక్షంలో స్వాధీనపరచుకున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించినట్లు ఎస్సై బి రవి తెలిపారు.

# పోషణ పక్వాడలో విశిష్ట ప్రతిభ

- బూర్గంపాడు సీడీపీఓ రేవతికి జిల్లా స్థాయి అవార్డు
- ఆన్‌లైన్ అప్‌డేట్స్‌లో మెరుగైన ప్రదర్శన
- జిల్లాలో ద్వితీయ స్థానం సాధన
- అంగన్వాడీ సేవలకు గుర్తింపు – అదనపు కలెక్టర్ విద్యా చందన చేతుల మీదుగా పురస్కారం



**బూర్గంపహాడ్ మహా :** : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం నిర్వహించే 15 రోజుల 'పోషణ పక్వాడ' కార్యక్రమంలో బూర్గంపాడు మండలం అంగన్వాడీ విభాగం విశిష్ట ప్రతిభ కనబర్చింది. కార్యక్రమాల అమలు మాత్రమే కాకుండా, వాటి వివరాలను సమయానికి ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో మెరుగైన పనితీరు ప్రదర్శించినందుకు బూర్గంపాడు ప్రాజెక్ట్ ఆఫీసర్ (సీడీపీఓ) రేవతి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి (DWO) స్వర్ణలత లెనీనా చేతుల మీదుగా రేవతికి అవార్డు ప్రదానం చేశారు. ఈ పురస్కారం బూర్గంపాడు మండలంలోని అంగన్వాడీ సిబ్బంది సమిష్టి కృషికి దక్కిన గౌరవంగా అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సీడీపీఓ రేవతి మాట్లాడుతూ, "పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా నిర్వహించిన పోషణ అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య పరీక్షలు, గర్భిణీ స్త్రీలు మరియు చిన్నారుల సంక్షేమానికి సంబంధించిన చైతన్య కార్యక్రమాలను సమయానికి డిజిటల్ వేదికల్లో నమోదు చేయడం వల్లే ఈ గుర్తింపు లభించింది. ఇది మా సిబ్బంది కృషికి వచ్చిన ఫలితం" అని తెలిపారు. అదనపు కలెక్టర్ విద్యా చందన మాట్లాడుతూ, "పోషణ పక్వాడ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పోషణపై అవగాహన పెంపొందించడం చాలా ముఖ్యమైన విషయం. ఈ దిశగా బూర్గంపాడు మండలం చూపిన ప్రతిభ అభినందనీయం" అని అన్నారు.డబ్ల్యూఓ స్వర్ణలత లెనీనా మాట్లాడుతూ, "అంగన్వాడీ వ్యవస్థను డిజిటల్ వైపు మళ్లించడం వల్ల సేవల పర్యవేక్షణ సులభతరం అవుతుంది. బూర్గంపాడు టీమ్ చేసిన కృషి ఇతర మండలాలకు ఆదర్శంగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. ఈ విజయానికి తోడ్పడిన అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, సిబ్బందికి రేవతి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో మరింత మంచి ఫలితాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు.

# 3వ రోజుకు ఆర్టీసీ సమ్మె..

- శంకర్ గౌడ్ మృతి పై మండిపడ్డ కార్మిక జేఏసీ..
- కుటుంబ సభ్యులతో ప్రదర్శన.. మానవహారం..
- సమస్యలు వెంటనే పరిష్కరించాలని కార్మిక జేఏసీ డిమాండ్..



**మణుగూరు, మహా :** న్యాయమైన హక్కులు, పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మిక జేఏసీ చేపట్టిన సమ్మె శుక్రవారంకు మూడవ రోజుకు చేరింది. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన శంకర్ గౌడ్ మృతిపై జేఏసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మణుగూరు డిపో ఎదుట నిర్వహించిన ఆందోళనలో భాగంగా కార్మికులు ముందుగా రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ప్రదర్శనగా టిడిపి సెంటర్‌కు చేరుకుని మానవహారం నిర్వహించారు. చిన్నారులు, మహిళలు మండుటెండను లెక్కచేయకుండా పెద్ద ఎత్తున పాల్గొనడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని కార్మిక జేఏసీ హెచ్చరించింది. తాత్కాలిక డ్రైవర్లతో బస్సులు నడపడం ద్వారా సంస్థకు నష్టం కలిగిస్తోందని ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చలు ప్రారంభించినట్లు సమాచారముందని, కీలక డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకునే దిశగా ప్రభుత్వం చర్చలు కొనసాగించాలని, స్పష్టమైన హామీలు వచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక, రాజకీయ, సంఘాల నేతలు, కార్మిక కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

## సారపాకలో పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ మెరుపుదాడి

**11 మంది అరెస్ట్..**
**రూ.57 వేల నగదు స్వాధీనం**

**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలంలోని సారపాకలో అక్రమంగా నడుస్తున్న పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపుదాడి నిర్వహించినట్లు సమాచారం.

**సమాచారం మేరకు...**

సారపాకలోని ఓ జామయిల్ తోటలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు అకస్మాత్తుగా దాడి చేయగా, అక్కడ పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో వారి నుండి  నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. పట్టుబడిన వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

# డ్రైనేజీ పనులను వేగవంతం చేయండి

**హోం శాఖ స్పెషల్ సెక్రటరీ సీవీ ఆనంద్‌కు ఎమ్మెల్యే బండారి విన్నపం**



**కుషాయిగూడ, మహా :** చర్లపల్లి డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న స్టార్మ్ వాటర్ డ్రైనేజీ పనుల పరిపాలనా ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. శుక్రవారం ఆయన సచివాలయంలో హోం శాఖ స్పెషల్ సెక్రటరీ సి.వి. ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చర్లపల్లి డివిజన్‌లో రూ.1.20 కోట్ల నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ పనులపై చర్చించారు. ఈ పనులకు సంబంధించి జైళ్ల శాఖ నుంచి రావాల్సిన అనుమతులు, సమన్వయంపై స్పందిస్తూ.. వెంటనే పనులు ప్రారంభించేలా జైళ్ల శాఖ డీజీకి తగిన సూచనలు చేయాలని ఎమ్మెల్యే కోరారు. డ్రైనేజీ నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రాంతాల్లో వరద నీటి సమస్యలు తొలిగి, ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని వివరించారు. పనుల నాణ్యతలో రాజీ పడకుండా, నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేసేలా మున్సిపల్ అధికారులకు జైళ్ల శాఖ అధికారులు సహకరించేలా చూడాలని విన్నవించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం నుంచి నిధులు రాబడుతూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.



## జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు తక్షణమే ఇవ్వాలి

**బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు**

**నేలకొండపల్లి, మహా:**నేలకొండపల్లి మండల పరిధిలో పనిచేస్తున్నటువంటి వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు, ఇండ్లును తక్షణమే ప్రభుత్వం మంజూరు చేయాలని బిఎస్పి మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు డిమాండ్ చేశారు. జీతభత్యం లేని విధులు నిర్వహిస్తూ ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా అహర్నిశలు కృషి చేస్తున్న విలేకరుల పాత్ర ఈ సమాజంలో ఎంతో ఘనీయమైనదని కొనియాడారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా విలేకరులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇస్తాము అన్న మాట నీటి మూటలాగా మిగిలి పోయిందన్నారు. సమాజంలో విలేకరిగా బాధ్యతగా పనిచేస్తున్న వారికి వారి వారి సంస్థల నుండి జీతభత్యాలు కూడా ఏమీ లేకపోగా కనీసం ప్రభుత్వం నుండి ఏదో సహాయం అందుతుందన్న ఆశ కూడా అందనిద్రాక్ష పుల్లన అన్నచందంగా మారిందన్నారు. ఎంతో మంది జర్నలిస్టులు కుటుంబాలను పనంగా పెట్టి జర్నలిస్టు వృత్తిలో కొన సాగుతున్నారని, అటువంటి జర్నలిస్టులకు ప్రభుత్వం నుండి ఏ రకమైన చేయూత లేక వారి పరిస్థితి దయనీయంగా, మారిందని వారికి తక్షణమే ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని, కనీసం వారికి నిలువ నీడ కోసం జర్నలిస్టుల కుటుంబాలకు భరోసగా కనీస నివాసం కోసం ఇండ్ల స్థలాలు ఇండ్లును తక్షణమే మంజూరి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి డిప్యూటీ తహసీల్దార్ కనకం నరసింహారావు యాదవ్ కి బిఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు వినతిపత్రం అందజేశారు

## అక్రమ నల్లబెల్లం పట్టివేత.. బొమ్మిశెట్టి శ్రీనివాస్ పై కేసు నమోదు



**నేలకొండపల్లి, మహా:** నేలకొండపల్లి మండలం లోని కోనాయిగూడెం లో బొమ్మిశెట్టి శ్రీనివాస్ అనే వ్యక్తి నల్లబెల్లం తయారీ చేసి గుడుంబా తయారీదారులకు విక్రయిస్తున్నాడని కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. టాస్క్ ఫోర్స్ బృందం, నేలకొండపల్లి సిబ్బంది తో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. మండలం లోని కోనాయిగూడెం లో నల్లబెల్లం అక్రమ రవాణా జరుగుతున్న విషయం ను తెలుసుకున్న ఎక్సైజ్ అధికారులు శుక్రవారం రాత్రి దాడులు చేశారు. గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి శ్రీనివాస్ అనే వ్యక్తి తన ఇంట్లో అక్రమంగా నల్లబెల్లం ను తయారు చేసి గుడుంబా తయారీదారులకు విక్రయిస్తున్నట్లు విచారణ లో తెలటంతో అతని పై కేసు నమోదు చేసి 1,944 కిలోల నల్లబెల్లం ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏఈఎస్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడారు...అక్రమ మద్యం తయారీకి సహకరించే వారి పై. నల్లబెల్లం నిల్వలు, రవాణా మరియు విక్రయాల పై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని పేర్కోన్నారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడులలో డీటీఎఫ్ సీఐ కరుణ శ్రీ, నేలకొండపల్లి సీఐ రమేష్. ఎస్సై లత లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



## రైతులు తప్పనిసరిగా రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

- 11 అంకెల సంఖ్యను రైతులకు కేటాయింపు
- మండల వ్యవసాయ అధికారి శ్వేత

**రాజేంద్రనగర్, మహా ;** ప్రతి రైతు తప్పనిసరిగా రైతు రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలని శంషాబాద్ తహసీల్దార్ కెరవీందర్ దత్ , మండల వ్యవసాయ శాఖ అధికారి శ్వేత అన్నారు. శంషాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఫార్మర్ రిజిస్ట్రేషన్ పై వ్యవ సాయ విస్తరణ అధికారులు, మీసేవ కేంద్రాల ప్రతినిధులు, గ్రామ పరిపాలన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని ప్రతి పౌరుడికి ఆధార్కర్డును గుర్తింపు కల్పించినట్లుగానే ప్రతి రైతుకు 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించే కార్యక్రమాని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.వ్యవసాయ రంగాన్ని పూర్తిగ డిజిటలైజేషన్ చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమని చేపట్టినట్లు తెలిపారు. భూమి కలి గిన ప్రతి రైతుకు సంబంధించిన భూయాజమాన్యా వివరాలు, వ్యక్తిగత సమాచారం ఆధారంగా ఫార్మర్ రిజిస్ట్రీలో రూపొందించబడుతుందన్నారు. ముఖ్యంగా పీఎం కిసాన్ పథకం లబ్ది పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డు, భూ యాజమాన్య పాస్బుక్ , ఆధార్ కు అను సంధానమైన మొబైలు నెంబర్ తో సమీపంలోని రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారి, సమీప మీసేవ కేంద్రాలను సంప్రదించి వెంటనే ఫార్మర్ ఐడి ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ నెల 23 నుంచి మే2 వరకు మండలంలో ప్రత్యేక డ్రైవ్ ఉంటుందని, ఈ అవకాశాని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయిబ్ తహశీల్దార్ వాణి, గ్రామ పరిపాలన అధికారులు, మీ సేవ కేంద్రాల ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ ప్రభుత్వానికి హైకోర్టు తీర్పు చెంపపెట్టు

- పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కాదు..
- అది కాంగ్రెస్ రాసిన స్క్రిప్ట్!
- డివిజన్ అధ్యక్షులు కోన్నమొల్ల శ్రీనివాస్
- కోలాన్ ప్రదీప్ రెడ్డి



**రాజేంద్రనగర్, మహా ;** మేడిగడ్డ కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కోసం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కోలుకోలేని దెబ్బ తగిలిందన్నారు. శంషాబాద్ సర్కిల్ పరిధిలోని జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కోత్వాల్ గూడా డివిజన్ అధ్యక్షులుకోన్నమొల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ విచారణ పేరుతో గత మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న రాజకీయ కక్షసాధింపులు నేటి తీర్పుతో బట్టబయలయ్యాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ తీరును తప్పుబడుతూ హైకోర్టు కీలక తీర్పును వెలువరించడాన్ని తెలంగాణవాదులుగా తము స్వాగతిస్తున్నము.తెలంగాణకు జలధారను అందించిన గత కేసీఆర్ సర్కార్‌పై రేవంత్ ప్రభుత్వం మూడు సంవత్సరాలు సాగించిన దుష్ప్రచారం నేటితో తేటతెల్లమైందన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు ఓ అద్భుతము, ఆ ప్రాజెక్టుతో తెలంగాణ సస్యశ్యామలమైందని విశ్లేషించాయి. కమిషన్ నివేదికను అడ్డుకొని కేసీఆర్‌పై కక్ష సాధించాలనే రేవంత్ కుట్రలు హైకోర్టు తీర్పుతో బెడిసికొట్టాయన్నారు. కోలాన్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ కోర్టు తీర్పుతో కేసీఆర్ పాలనపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగనుందని అభిప్రాయపడ్డారు.కాళేశ్వరంతో తెలంగాణ సస్యశ్యామలమైంది. తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలను తీర్చడంలో కాళేశ్వరం కీలకంగా మారింది. గత దశాబ్దకాలంలో ఈ స్థాయిలో సాగునీటి పరివర్తన తెలంగాణలో మినహా మరే రాష్ట్రంలోనూ జరుగలేదంటే అది కాళేశ్వరం వల్లే. తెలంగాణకు కాళేశ్వరం జీవనాడిగా చెప్పొచ్చు. సాగు, తాగు నీటి అవసరాలను తీర్చడమే కాకుండా ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ కొత్త రికార్డులను నెలకొల్పేందుకు కాళేశ్వరం దోహదపడిందన్నారు.కాళేశ్వరంతో తెలంగాణలో సాగు విస్తరణ పెరిగింది. భూగర్భ జలాలు ఉబికి వచ్చాయి. పరిశ్రమలకు నీటి లభ్యత పెరిగింది. కాలేశ్వరంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆరోపిస్తుంది. కాళేశ్వరం మొత్తం ప్రాజెక్టు కూడా లక్ష కోట్లు దాటలేదు లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుంది. రేవంత్ రెడ్డి బిజెపి నాయకులు కలిసి కాళేశ్వరం ప్రాజెక్టుపై లేనిపోని అపవాదులు సృష్టిస్తున్నారు. నేటితో ఈ అపవాదులకు ముగింపు హైకోర్టు పలికిందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షులు మాడవతిపరమేశ్వరి నరేందర్, కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్, రాష్ట్ర నాయకులు చెక్కల ఎల్లయ్య, మంచర్ల శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, మల్లేష్ ముదిరాజ్, హనుమంతు ముదిరాజ్, పరంధాములు, గుంటి చరణ్,బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకులకు రైతుల పక్షన మాట్లాడే అర్హత లేదు..

**ఖమ్మంజిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు..**



**నేలకొండపల్లి, మహా:** ఖమ్మంజిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు ఘాటుగా విమర్శించారు ... బిఆర్ఎస్ నాయకులు రైతుల పక్షాన ధర్నా చేయడం విడ్డూరంగా ఉందన్నారు..మీకు రైతుల పక్షాన మాట్లాడే అర్హత లేదన్నారు.. తెలంగాణ రాష్ట్రం లో చరిత్రలో పండనంతా విధంగా గత సంవత్సరం,ఈ సంవత్సరం వరి,మొక్కజొన్న పండడం హర్షనీయమన్నారు..రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు.. దానికి తక్కట్టుగానే ప్రభుత్వం అన్ని విధాలుగా రైతు పండించిన పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేయడానికి కోనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు..రైతులు పండించిన పంటను చివరి గింజ వరకు కోనుగోలు చేస్తామన్నారు..వీరు మోసలి కన్నీరు కారుస్తూ, సానుభూతిని తెలియజేయనవసరం లేదని హెచ్చరించారు..రైతులు అంత యార్డులలో బస్తాలను కాటాలు వేసుకునే పనుల్లో ఉన్నారు..రైతులకు అవసరం ఉన్న చోట కోనుగోలు కేంద్రాలను తెరిచి,ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది అని పేర్కొన్నారు..ప్రభుత్వానికి ఎంత కష్టమైన,నష్టమైనా భారించడానికి సిద్ధంగా ఉన్నామని ఈ జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు,తుమ్మల నాగేశ్వరరావు గారు,పోంగులేటి శ్రీనివాసరెడ్డి గారు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు..ఇప్పటికే మూపై కోనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.. ఇంకా అవసరమైతే ఏర్పాటు చేస్తామన్నారు..ఇప్పటికే 50వేల మెట్రిక్ టన్నులు కోనుగోలు కేంద్రాల ద్వారా కోనుగోలు చేయడం జరిగిందని తెలిపారు..ఇంకా రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు..

## వాసవి జయంతిని రాష్ట్ర పండగ అధికారిక ప్రకటనతో....
# సీఎం చిత్రపటానికి ఆర్యవైశ్యులు క్షీరాభిషేకం



**రాజేంద్రనగర్, మహా ;** తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ని రాష్ట్ర పండగ గా గుర్తుంచి జీవో విడుదల సందర్భంగా మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి వాసవి కన్యక పరమేశ్వరి దేవాలయ చైర్మన్ సోమ శ్రీనివాస్ గుప్త ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ధనంజయ్, ఆర్యవైశ్య సంఘము నాయకులురంగా ప్రభాకర్ గుప్తా,అర్థం లక్ష్మయ్యగుప్తా, సురేష్ గుప్తా, శ్రీనివాసులు గుప్తా, అనంతం గుప్తా,బుచ్చయ్య గుప్తా, భద్రయ్య గుప్తా, శేఖర్ గుప్తా, కృష్ణయ్య గుప్తా, అశోక్ గుప్తా, శ్రీనివాస్ గుప్తా,శేఖర్ గుప్తా, మల్లేష్ గుప్తా,విజయకుమార్ గుప్తా,పుల్లయ్య గుప్త,సంపత్ గుప్తా, సందీప్ గుప్తా, సత్యనారాణ గుప్తా,బాలరాజ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్ ను సద్వినియోగం చేసుకోవాలి

**ఏర్పాట్లును పరిశీలించిన అడిషనల్ కలెక్టర్, డీపీవో, జడ్పీ సీఈవో**



**నేలకొండపల్లి, మహా:** రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన సొంత నియోజకవర్గంలో శనివారం నుంచి ప్రజాదర్బార్ ను నిర్వహించనున్నారు. నేలకొండపల్లి మండలం లోని రాయగూడెం లో తొలి కార్యక్రమం ను లాంచనంగా ప్రారంభించనున్నారు. ప్రజల ముంగిటకు అన్ని శాఖల అధికారులను తీసుకొస్తున్నారు. ఎటువంటి ప్రజా సమస్యకైనా తక్షణ పరిష్కారం చేసేందుకు శాఖల వారీగా జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి* అధికారులను ఆహ్వానిస్తున్నారు. రాయగూడెం క్లస్టర్ లో ఆజయతండా, రాయగూడెం, చెరువుమాధారం, మంగాపురంతండా, అప్పలనరసింహాపురం, బుద్దారం, కట్టుకాచారాం, కొంగర, రాజారాంపేట, బైరవునిపల్లి పంచాయతీ లకు సంబంధించిన ప్రజలు ఈ పరజా దర్బార్ లో పాల్గొనున్నారు. రెవిన్యూ భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల విజ్ఞప్తులు, కొత్త రేషన్కార్డులు, స్థానిక మౌళిక సదుపాయాల గురించి ఏ సమస్య కు సంబంధించినదైనా వినతి పత్రాలను స్వీకరించనున్నారు. ఏర్పాట్లు ను జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, సీఈవో శ్రీనివాసరెడ్డి లు పరిశీలించారు. తొలుత రాయగూడెం లో దర్బార్ జరిగే ప్రదేశం ను పరిశీలించారు. ఏర్పాట్లు గురించి చర్చించారు. వసతులు గురించి ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వేసవి తీవ్రత ఉన్నందున్న మజ్జిగ, చల్లని తాగునీటిని అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. దర్బార్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీవో యర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



**మణుగూరు బార్ నూతన కమిటీ**
## ప్రమాణ స్వీకారం

- బార్–బెంచ్ సంబంధాలు బలపడాలి
- మణుగూరు మెజిస్ట్రేట్ సూరిరెడ్డి

**మణుగూరు, మహా :** మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మెజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బార్-బెంచ్ సంబంధాలు సత్సంబంధాల వాతావరణంలో కొనసాగాలని, న్యాయవాదులు, న్యాయ వ్యవస్థ పరస్పర సహకారంతోనే కక్షిదారులకు న్యాయన్ని మరింత సమర్థవంతంగా అందించగలమని పేర్కొన్నారు. నూతన అధ్యక్షుడు, కార్యదర్శి సహా కమిటీ సభ్యులు న్యాయవాదుల సంక్షేమం, ఐక్యత కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం నూతన అధ్యక్షుడు గురుకృష్ణ, కార్యదర్శి కామసాని మధుసూదన్, ఉపాధ్యక్షురాలు సావిత్రితో పాటు కమిటీ సభ్యులు గొడిశాల వెంకటరత్నం, నాగార్జున రెడ్డి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గురుకృష్ణ, కార్యదర్శి మధుసూదన్ లు మాట్లాడుతూ, న్యాయవాదుల ఐక్యత, సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తామని, కోర్టు భవనంలో ఉన్న మౌలిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మెజిస్ట్రేట్ సూరి రెడ్డిని పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమణారెడ్డి, రామకోటయ్య, అంకం సర్వేశ్వరరావు, రామ్మోహన్ రావు, అన్వేష్, సాంబ, లావణ్య, ప్రియాంక, సుష్మిత, సునీత, రమేష్ తదితరులు, కోర్టు సిబ్బంది, కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.

## అన్నదాతల ప్రాణాల కాపాడేందుకు కిసాన్ మిత్ర "చఢీ" అత్యాధునిక పరికరాన్ని ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం

**రైతులు పాము కాటుకు గురికాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు**

**నేలకొండపల్లి, మహా:**దేశవ్యాప్తంగా రైతన్నలు పాము కాటుకు గురై లక్షలాది మంది ప్రాణాలను కోల్పోయారు. పాము కాటుకు గురై రైతులు మృత్యువాత పడకుండా కేంద్ర ప్రభుత్వం అత్యాధునిక పరికరాన్ని రూపొందించింది. ఈ అత్యాధునిక పరికరాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ అధ్యాధునిక "కిసాన్ మిత్ర చడి" పరికరాన్ని దేశ రాజధాని ఢిల్లీలో ఆవిష్కరించారు. కిసాన్ మిత్రా చడి పరికరాన్ని రైతులు తమ వ్యవసాయ పొలంలోకి వారి వెంట తీసుకువెళ్లి చడీ కి ఉన్న బటన్ ను నొక్కాల్సి ఉంటుంది. చడీ కి ఉన్న బటన్ నొక్కగానే ఆ కర్ర తన పనిని ప్రారంభిస్తుంది. రైతు ఉన్నస్థలం నుంచి దాదాపు 15 లీటర్ల నుంచి 20 మీటర్ల భూమి లోపల ఉన్న విష సర్పాలు క్రిమి, కీటకాలను అది వెంటనే గుర్తిస్తుంది. వెంటనే రైతు చేతిలో ఉన్న ఈ కర్ర వైబ్రేట్ ను ప్రారంభి స్తుంది. అప్రమత్తమైన రైతు పరిసర ప్రాంతాలలో పాములు, క్రిమి, కీటకాలు ఉన్నాయని గుర్తించి వెంటనే అప్రమత్తమవుతారు. ఈ కిసాన్ మిత్ర చెడి కర్రతో రైతులు తమ విలువైన ప్రాణాలను పాముల బారిన పడకుండా కాపాడుకోవచ్చని ఈ అత్యాధునిక పరికరాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందించింది ఈ పరికరంతో దేశవ్యాప్తంగా పాము కాటుకు గురికాకుండా రైతులు అప్రమత్తవ్వడమే కాక ఈ పరికరాన్ని రూపొందించిన మోడీ ప్రభుత్వానికి కృతజ్ఞతలుతెలియజేస్తున్నారు. త్వరలో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రభుత్వాన్ని దేశవ్యాప్తంగా రైతులకు అందజేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

# గురునానక్ లో అంతర్జాతీయ రీసెర్చ్ కాన్‌క్లేవ్ 2026



**మహా:** ఇబ్రహీంపట్నంలోని గురునానక్ యూనివర్సిటీ విద్యా ప్రాముఖ్యత, నూతన ఆవిష్కరణలు, విలువల ఆధారిత విద్యకు ప్రతీకగా ఉందని ఛాన్సలర్ సర్దార్ గగన్ దీప్ సింగ్ కోహ్లీ అన్నారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విశ్వవిద్యాలయంలో రాష్ట్రంలోనే మొట్టమొదటి ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై అంతర్జాతీయ రీసెర్చ్ కాన్క్లేవ్ 2026ను విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి దేశ, విదేశాల నుంచి ప్రముఖ విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, పరిశ్రమ నిపుణులు మరియు పరిశోధకులు హాజరయ్యారు.ఈ అంతర్జాతీయ సదస్సును గురునానక్ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ సర్దార్ గగన్ దీప్ సింగ్ కోహ్లీ, వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్ ఎస్ సాయిని మార్గదర్శకత్వంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు అతిథులను సాదరంగా ఆహ్వానిస్తూ, తమ విలువైన సమయాన్ని కేటాయించి కార్యక్రమాన్ని విచేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ వారిని సత్కరించి ధన్యవాదాలు తెలియచేసారు. యూనివర్సిటీ ఛాన్సలర్, వైస్ ఛాన్సలర్ తమ ప్రసంగంలో గురునానక్ యూనివర్సిటీ విద్యా ప్రాముఖ్యత, నూతన ఆవిష్కరణలు, విలువల ఆధారిత విద్యకు ప్రతీకగా ఉందని గురు నానక్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో స్థాపించబడిన ఈ యూనివర్సిటీ,ప్రతిభను పెంపొందించడం, పరిశోధనలను ప్రోత్సహించడం, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యను అందించడం వంటి రంగాలలో సమగ్ర అభివృద్ధి, అంతర్జాతీయ స్థాయి అవకాశాలు, ఆధునిక సదుపాయాలతో విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని వారు తెలియచేసారు. ఈ సందర్భంగా అతిధుల సమక్షంలో కార్పొరేట్ సంస్థలతో నూతన ఒప్పందాలను కుదుర్చికొకడం జరిగింది. దేశంలో ప్రసిద్ధి చెందిన విద్య, కార్పొరేట్, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన ప్రముఖ వ్యక్తులు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి, సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు సిబ్బందికి, వారి అనుభవాన్ని పరిజ్ఞానాన్ని భవిష్యత్తులో తమ ఆవిష్కరణలను ఎలా ఆవిష్కరించాలనే అంశాలపై ప్రసంగించారు. విద్యార్థులకు తమ అమూల్య సందేశాన్ని అందించారు.



# మహా పత్రిక





ANN తెలుగు

## ఆర్టీసీ కార్మికులకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది

**నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి**



**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ ఆర్టీసీ కార్మికులకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, బిఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి తెలిపారు. డిపో వద్ద శుక్రవారం ఆర్టీసీ కార్మికులతో కలిసి శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి కలగాలని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి, రెండు నిమిషాలు మౌనం పాటిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు అండగా బిఆర్ఎస్ పార్టీ ఉంటుందన్నారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం మెడలు వంచే వరకు కార్మికులకు మద్దతుగా బిఆర్ఎస్ పార్టీ నిలుస్తుంది అన్నారు. ఆర్టీసీ కార్మికుల హక్కుల కోసం పోరాటం చేయడమే బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కర్తవ్యం అన్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు.వారికి రావలసిన పిఆర్సీలను వెంటనే చెల్లించాలన్నారు.ఆర్టీసీ కార్మికుల సమస్యలను బిఆర్ఎస్ పార్టీ అసెంబ్లీలో ప్రస్తావిస్తుందన్నారు.ఈ మీ పోరాటానికి పూర్తి మద్దతు ఉంటుంది. ఐక్యతతోనే ముందుకు వెళ్లాలి ఐక్యంగా ఉండి కార్మికుల హక్కులు సాధించేవరకు పోరాటం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తీర్చడమే ప్రధాన లక్ష్యం

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..**



**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రజల తాగునీటి కష్టాలను తీర్చడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. అత్తాపూర్ సర్కిల్, మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని దుర్గా నగర్ ప్రాంతంలో కొత్త శుక్రవారం మంచినీటి పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు.హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ ఆధ్వర్యంలో ఒక కోటి 84 లక్షలు రూపాయల వ్యయంతో ఈ పనులు చేపట్టారు. అయ్యప్ప టెంపుల్ సమీపంలోని వివిధ గృహ సముదాయాలకు ప్రయోజనం చేకూర్చేలా 200 ఎం ఎం, 150 ఎం ఎం,మరియు 100 ఎం ఎం దయా కలిగిన వాటర్ సప్లై లైన్లను ఏర్పాటు చేయనున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి శుద్ధి చేసిన మంచినీటిని అందించడమే మా లక్ష్యం,అన్నారు.ఈ పైప్‌లైన్ పనులు పూర్తయితే కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి పరిసర ప్రాంతాల్లో నీటి ఎద్దడి శాశ్వతంగా తొలగిపోతుందన్నారు. పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,జలమండలి అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపూర్ కాలనీ పాఠశాలలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ సమావేశం

- పాఠశాల ప్రగతి, విజయాల ప్రదర్శన, వివరణ
- ఘనంగా గ్రాడ్యుషన్ డే
- ప్రగతి పత్రాలు అందజేత
- ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్స్ బహుకరణ
- వేసవిలో పిల్లల పట్ల తీసుకోవాలసిన జాగ్రత్తలు తెలియజేయుట
- పర్యావరణ పరిరక్షణ లో భాగంగా పేపర్ సంచులు, పెన్సిల్స్, పెన్నులు బహుకరుణ



**సదాశివపేట: మహా:** 202526 విద్యా సంవత్సరం చివరి పనిదినం సందర్భంగా గురువారం నిజాంపూర్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మీనా అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో తల్లిదండ్రులనుద్దేశించి ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ మాట్లాడుతూ 2025 26 విద్యా సంవత్సరములో పాఠశాల సాధించిన అభివృద్ధి,ప్రత్యేక గుర్తింపులు, విజయాల గురించి వివరించారు అంతేకాకవేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలను ఉదయం,సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు పంపాలని, మధ్యాహ్న సమయంలో ఇంటిలోనే ఉండే విధంగా చూడాలని, చెరువులు, కాలవులు,నదుల దగ్గరకు పిల్లలు వెళ్లకుండా చూడాలని అన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలతో కలసి పేపర్ చదవడం,టి.వి చూడటం,వారు చేసే చిన్న,చిన్న పనులను అభినందించడం వంటివి చేయాలన్నారు.వారికి ఆత్మ విశ్వాసం పెంపొందేలా వ్యవహరించాలని అన్నారు. అనంతరం తల్లిదండ్రుల సమక్షంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ,ఉపాధ్యాయులు నవనీత,సునీత లు విద్యార్థులకు అభివృద్ధి పత్రాలు (ప్రోగ్రెస్ కార్డ్స్) ఇచ్చారు.ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలు బహుకరించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులందరూ ప్లాస్టిక్ సంచులు బదులు పేపర్ సంచులు వాడాలని పేపర్ పెన్సిల్స్ సూచిస్తూ విద్యార్థులు పేపర్ సంచులను మరియు పేపర్ పెన్సిల్స్ ను ప్రదర్శించారు.విద్యార్థులకు పేపర్ సంచులు మరియు పేపర్ పెన్సిల్స్ ను బహుకరించారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మీనా, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు నవనీత,సునీత, అంగన్వాడి టీచర్ సువర్ణ, శోభ,తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు....

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కు ఆహ్వానం

**ఆలయ కమిటీ అధ్యక్షులు అనుముల సాయిరాజ్**



**సదాశివపేట, మహా :** ఆర్యవైశ్యుల ఆరాధ దైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు అనుముల సాయిరాజ్ వారి సభ్యులు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్ నివాస గృహంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందజేసి ఆహ్వానించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొనడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు కోడూరు అంజయ్య. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు దిడ్డిగే నాగేష్. వాసవి క్లబ్ అధ్యక్షుడు బుగ్గారం శ్రీనివాస్. దిద్ది గే వినోద్. మల్లికార్జున శంకర్. కృష్ణ. రవీందర్. లక్ష్మణ్. పార్టీ మండల అధ్యక్షుడు పెద్ద గొల్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## 26న నిర్వహించే శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని జగ్గారెడ్డికి ఆహ్వానం...

**ఆలయ కమిటీ అధ్యక్షుడు అనుముల సాయిరాజ్**



**సదాశివపేట :మహా :** 26 తేదీ ఆదివారం నిర్వహించేశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ని జయంతి ఉత్సవాలకు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ సంఘం అధ్యక్షుడు అనుముల సాయిరాజ్ వారి సభ్యులు సంగారెడ్డి ఆయన నివాస గృహంలో జగ్గారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు.ఈ కార్యక్రమానికి ఆలయ సంఘం కార్యదర్శి మల్లికార్జున శంకర్. కోశాధికారి పార్శం బిక్షపతి . ఉపాధ్యక్షులు దిద్దిన వినోద్ రాగల అశోక్ . తాటికొండ నాగనాథ్. మరియు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ . పాల్గొనడం జరిగింది.

# డబ్బుల కోసం మృతదేహంతో వ్యాపారం చేశారా..?

- మహోనియా ప్రైవేటు హాస్పిటల్ నిర్వాకం..!
- చనిపోయిన మహిళకు చికిత్స.!
- డబ్బు వసూలు తర్వాత మరణ వార్త..?
- ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీకి ఇదే సరైన నిదర్శనం..!






**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మహోనియా ప్రైవేటు ఆసుపత్రిలో దారుణం.. డబ్బుల కోసం చనిపోయిన మహిళకు చికిత్స అందిస్తూ! నమ్మించి డబ్బులు వసూలు చేశారు. ఆస్పత్రి సిబ్బందిపై బాధితులు మండిపడుతున్నారు. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధి, మన్నెగూడలోని మహోనియా హాస్పిటల్లో దారుణం చోటు చేసుకుంది. మృతి చెందిన మహిళ మృతదేహానికి చికిత్స చేస్తునామంటూ బాధితుల నుండి డబ్బుల కోసం దారుణానికి ఒడిగట్టిన ఘటన అదిబట్ల సర్కిల్ పరిధిలోని మన్నెగూడలో చోటు చేసుకుంది. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన కట్టెల దివ్య అనే మహిళ, మన్నెగూడలోని మహోనియా ఆసుపత్రికి ఆరోగ్యరీత్యా చికిత్స కోసం వెళ్లగా, చికిత్స అందిస్తున్న క్రమంలో ఆమె మరణించినప్పటికీ, రోగికి చికిత్స అందించడం జరుగుతుందని కుటుంబ సభ్యులను నమ్మిస్తూ, భారీగా డబ్బులు వసూలు చేసినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆసుపత్రికి తరలిస్తామని కుటుంబసభ్యులు చెప్పగానే అసలు నిజం బయటపడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులు హాస్పిటల్ ముందు తమకు న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. హాస్పిటల్ వద్దకు చేరుకున్న ఆదిభట్ల పోలీసులు సమస్యను సద్గుమనించారు.

**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్..**

మరణించిన వ్యక్తికి చికిత్స జరుగుతోందని చెప్పిన హాస్పిటల్ సిబ్బంది, గాంధీకి తీసుకెళ్తామనగానే మహిళ అప్పటికే మరణించిందని చెప్పడం సంచలనంగా మారింది. డబ్బుల కోసం మృతదేహంపైనే వ్యాపారం చేశారా..? అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరణించిన మహిళకు నాలుగు సంవత్సరాల పాప ఉండటంతో అక్కడ విషాద ఛాయాలు అలుముకున్నాయి. సరైన డాక్టర్లు, వసతులు లేకుండా ప్రైవేట్ ఆసుపత్రులు.. ఇలా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడడం ఎంతవరకు సమంజసమని స్థానికులు మండిపడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీకి ఇది సరైన నిదర్శనమని ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఆదిభట్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## డ్రైనేజ్ సమస్యలపై బిజెపి నాయకుల ఫిర్యాదు..



**రాజేంద్రనగర్, మహా ;** మైలార్దేవపల్లి డివిజన్ పరిధిలో డ్రైనేజీ సమస్యలపై బిజెపి నాయకులతో కలిసి డివిజన్ అధ్యక్షులు సూర్ రెడ్డి వినయ రెడ్డి హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.డ్రైనేజ్ నిల్వ సమస్య,పేద పైప్‌లైన్ నిర్వహణ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.గత 3 నెలలుగా దుర్గా నగర్ ప్రాంతంలో డ్రైనేజ్ నిల్వ సమస్య అలాగే కొనసాగుతుంది.దుర్గా కిడ్స్ స్కూల్ వెనుక భాగంలో నీరు నిల్వ ఉండటంతోప్రజలు, చిన్నపిల్లలు అనేక అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయారు ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, వెంకట్రమణ గుప్తా , బొమ్మ రాజు నర్సింహా, నర్సి రెడ్డి, అంజి, కొండాల్, ప్రేమ్, గణేష్, వేణు , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి

**ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు..**



**రాజేంద్రనగర్, మహా ;** తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు గత కొంతకాలంగా న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటు సమ్మె బాట పట్టారు. సమ్మె చేస్తున్న కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం కనికరం లేకుండా అరెస్టులు చేస్తూ,లాఠీలతో భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గం,అన్నారు. అరెస్టు చేసిన ఆర్టీసీ ఉద్యోగులను తక్షణమే విడుదల చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు.హయత్ నగర్ డిపో పరిధిలో ఏఐటియుసి అనుబంధ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు వెంకన్నను అక్రమంగా అరెస్టు చేయడం బాధాకరమని తక్షణమే విడుదల చేయాలని పర్వతాల డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు ఏఐటియుసి సంపూర్ణంగా మద్దతు తెలియజేస్తూ జిల్లా వ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తక్షణమే ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ది ప్రభుత్వ హత్య

**మధుసూదనాచారి తెలంగాణ తొలి శాసనసభ స్పీకర్**



**వలిగొండ, మహా :** ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మరణం ప్రభుత్వ హత్య అని తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్ గా పనిచేసిన మధుసూదనా చారి అన్నారు శుక్రవారం శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వెళుతున్న సమయంలో ఆలేరు వద్ద పోలీసులు అరెస్టు చేసి భువనగిరి నుండి వలిగొండ పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చిన సందర్భంగా మహా న్యూస్ రిపోర్టర్ తోమధుసూదనాచారి మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను తుంగలో తొక్కి హామీలను అమలు చేయకపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు మళ్లీ వచ్చేది బి ఆర్ ఎస్ ప్రభుత్వమే అని ఆయన అన్నారు

## గోపరాజు పల్లి మార్కెట్ యార్డు సమస్యపై ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి స్పందించాలి

**సలిగంజి వీరస్వామి సిపిఐ మండల కార్యదర్శి**



**వలిగొండ, మహా :** గోపరాజుపల్లి మార్కెట్ యార్డు ఇన్చార్జి విషయంపై స్థానిక ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని వలిగొండ మండల సిపిఐ కార్యదర్శి సలిగంజి వీరస్వామి సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్ అన్నారు వారు శుక్రవారం మార్కెట్ యార్డ్ ను సందర్శించిన సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్ ఇన్చార్జి వ్యవహారంలో ఇరు వర్గాల మధ్య గురువారం ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని వాటిని వెంటనే పరిష్కరించి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి నరిగె యాదయ్య సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి సలిగంజి కృష్ణ కుమార్ కట్ల యాదగిరి యాస జనార్దన్ రెడ్డి దొండ నరసయ్య పాలకూర్ల రఘుపతి ఏనుగుల రాములు గ్రామపంచాయతీ సభ్యులు గాజుల లక్ష్మమ్మ గాజుల మల్లయ్య పోల బోయిన సత్తయ్య రావుల యాదయ్య సలిగంజి నరసింహ సలిగంజి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

## భవనాలను పరిశీలించిన వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



**వేములవాడ,మహా:** వేములవాడ మున్సిపల్ పరిధిలో గల తిప్పాపూర్ లో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మహి ళా సంఘాల భవన నిర్మాణ ప నులకు మోక్షం లభించనుంది. శుక్రవారం పట్టణంలోని తిప్పా పూర్ ప్రాంతంలో గల 7, 8 వార్డుల్లో అసంపూర్తిగా ఉన్న భవనాలను ప్రభుత్వ విప్, శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సూచనల మేరకు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు క్షేత్రస్థాయి లో పరిశీలించారు. గతంలో ఈ భవనాల నిర్మాణ పనులు ప్రారం భమైనప్పటికీ వివిధ కారణాల వల్ల మధ్యలోనే నిలిచిపోయా యి. దీంతో భవనాలు నిరుప యోగంగా మారి మహిళా సం ఘాల కార్యకలాపాలకు ఆటంకం కలుగుతోంది. ఈనేపథ్యంలో చైర్మన్ పుల్కం రాజు, స్థానిక కౌన్సిలర్లు ఎల్ల శ్రీ నివాస్, మైలారం శ్రీనివాస్ లతో కలిసి భవన నిర్మాణ పురోగతిని, మిగిలి ఉన్న పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేములవాడ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక ఆదేశాల మేరకు ఈ పర్యటన చేపట్టినట్లు చైర్మన్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కృషితో ఈ భవనాల పూర్తికి అవసరమైన ప్రత్యేక నిధులను త్వరలోనే మంజూరు చేయిస్తా మని హామీ ఇచ్చారు. నిధులు విడుదలైన వెంటనే యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేస్తామని తెలిపారు. మహిళా సంఘాలకు సొంత భవనాలు అందుబాటు లోకి వస్తే వారు సమావేశాలు నిర్వహించు కోవడానికి, శిక్షణా కార్యక్రమాలకు ఎంతో సౌకర్యం గా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.తమ వార్డుల్లోని సమస్యను గుర్తించి భవనాలను పూర్తి చేసేందుకు చొరవ చూపిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు, చైర్మన్ పుల్కం రాజుకు స్థానిక కౌన్సిలర్లు మరియు మహిళా సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, ఎఇ అనన్య, మున్సిపల్ సిబ్బంది, నాయకులు మరియు మహిళా తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల పక్షాన నిలబడి పోరాడుతాం.!

- బిజెపి మాజీ ఎంపీ బూర నరసయ్య గౌడ్
- ఆర్టీసీ కార్మికులకు సంఘీభావ ర్యాలీ నిర్వహణ



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమక్షంలో వెంటనే పరిష్కరించాలి, శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ఉండాలని, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మున్సిపల్ కేంద్రంలో ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా బిజెపి మాజీ ఎంపీ, నాయకులు సంఘీభావం తెలుపుతూ... నియోజకవర్గం బిజెపి నాయకులు డిపో నుండి బస్ స్టాప్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ హాజరై, ఆర్టీసీ కార్మికుల సమస్యలు నెరవేర్చాలంటూ ఆత్మహత్యకు పాల్పడిన, దివంగత శంకర్ గౌడ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం బూర నరసయ్య గౌడ్ మాట్లాడుతూ... శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ఉండాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కష్ట సమయంలో కార్మికుల పక్షాన నిలబడి న్యాయం కోసం పోరాడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయంలో తెలంగాణ డీజీపీ ప్రత్యేక పూజలు



**వేములవాడ,మహా:** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని డీజీపీ శివధర్ రెడ్డి శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీజీపీ ఆలయ వసతి గృహానికి చేరుకున్న వెంటనే పోలీస్ బృందం గౌరవ వందనం సమర్పించింది. అనంతరం ఆలయంలోకి ప్రవేశించిన ఆయనకు ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి వాచకంతో ఘనంగా స్వాగతం పలికారు. తరువాత స్వామివారి మండపంలో అర్చకులు వేద పండితులు తీర్థ ప్రసాదం అందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ డీఈఓ భాస్కర శర్మ స్వామివారి శేష వస్త్రం, లడ్డు ప్రసాదం చిత్రపటాన్ని డీజీపీకి అందజేశారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ శ్రీ మహేష్ బి గీతే, వేములవాడ ఆర్డీవో రాధాబాయి, వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు, ఆలయ ఏఈఓ జి. అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చర్చలతోనే సమస్యలు పరిష్కారం

# ఆత్మహత్యలు వద్దు!

- రైతుబంధు, బోనస్‌లలో ఏదో ఒకటి అమలు చేయాలి..
- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని మండలి చైర్మన్ గుత్తా విజ్ఞప్తి..



**నల్గొండ, మహా :** ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వం పట్టుదలకు పోకుండా ప్రజల ప్రయోజనాల దృష్ట్యా సమ్మెను విరమించే దిశగా అడుగులు వేయాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కోరారు. శుక్రవారం నల్గొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుడు శంకరయ్య గౌడ్ ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సమస్య ఏదైనా చర్చల ద్వారానే పరిష్కారం అవుతుంది.. ఆత్మహత్యలతో కుటుంబాలు వీధిన పడతాయి తప్ప ప్రయోజనం ఉండదు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**రైతు పథకాలపై స్పష్టత అవసరం..**

రాష్ట్రంలో రైతుబంధు సంపూర్ణంగా అందలేదన్న అసంతృప్తి రైతాంగంలో ఉందని గుత్తా పేర్కొన్నారు. రైతుబంధుతో పాటు సన్నవడ్లకు బోనస్ ఇవ్వడం ప్రభుత్వంపై ఆర్థిక భారమేనని అభిప్రాయపడ్డారు. ఈ రెండు పథకాలపై ప్రభుత్వం పునరాలోచన చేసి రైతులకు ఏది మేలు చేస్తుందో నిర్ణయించి ఏదో ఒక పథకాన్ని సంపూర్ణంగా అమలు చేస్తే బాగుంటుందని సూచించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లు వేగంగా సాగుతున్నప్పటికీ, ఈసారి 'తాలు' సమస్య ప్రధాన అవరోధంగా మారిందని ఆయన తెలిపారు. నాసిరకం విత్తనాల వల్లే ఈ సమస్య తలెత్తుతోందని అధికారులు గుర్తించినట్లు చెప్పారు. అకాల వర్షాల ముప్పు పొంచి ఉన్నందున, కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించాలని అధికారులను కోరారు.

**పొరుగు రాష్ట్రాల ధాన్యంపై నిఘా..**

పొరుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ధాన్యం కొనకపోవడంతో అక్కడి రైతులు తెలంగాణకు వచ్చి ఇక్కడ అధిక ధరకు అమ్ముకుంటున్నారు. దీనివల్ల మన రాష్ట్ర రైతులకు తీరని నష్టం జరుగుతోంది అని గుత్తా హెచ్చరించారు. ధాన్యం సేకరణలో కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరినప్పటికీ స్పందన కరువైందని విమర్శించారు. పి.సి. ఘోష్ కమిషన్ విషయంలో హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని కేవలం సెక్షన్ 8 ప్రకారం నోటీసులు ఇవ్వనందున కేసీఆర్, హరీష్ రావులపై చర్యలు తీసుకోవద్దని మాత్రమే తెలిపిందని స్పష్టం చేశారు. వాస్తవాలను వదిలేసి ప్రతిపక్షాలు రాజకీయాల కోసం ప్రజలను రెచ్చగొట్టడం సరికాదని హితవు పలికారు. రాజకీయాల్లోకి యువత పెద్ద సంఖ్యలో రావాలని, వారికి మరిన్ని అవకాశాలు దక్కాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు.

## అక్రమ మట్టి తవ్వకాలపై ఉక్కుపాదం..!

**నల్గొండ, మహా :** జిల్లాలో అనుమతి లేకుండా సాగుతున్న ఇసుక, చెరువుల మట్టి అక్రమ తవ్వకాలపై జిల్లా యంత్రాంగం కఠినంగా వ్యవహరించనుంది. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించి తవ్వకాలు జరిపినా, రవాణా చేసినా తక్షణమే వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి ఆయన ఆర్డీవోలు, తహసీల్దార్లు, డీఎస్పీలు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ అవసరాల నిమిత్తం చెరువుల నుంచి మట్టి తీసుకోవాలన్నా తప్పనిసరిగా ముందస్తు అనుమతులు ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు ఇసుక కొరత లేకుండా చట్టబద్ధంగా లభ్యత పెంచాలి. కొత్తగా అవసరమైన ప్రాంతాల్లో ఇసుక రీచ్‌ల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ముఖ్యంగా కనగల్లు మండలం తిమ్మన్నగూడెం, అనేశ్వరం గుట్ట చెరువుల వద్ద జరుగుతున్న అక్రమ తవ్వకాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత రాకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం రవాణా సౌకర్యం కల్పిస్తామని కలెక్టర్ వెల్లడించారు. వేములపల్లి మండలం బొమ్మకల్లు, రావులపెంట ప్రాంతాల్లో కొత్తగా రెండు ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com